# విశాల భారతి

తెలుగు దినపత్రిక

29-03-2026

www.vishalabharati.com
epaper.vishalabharati.com

ఆదివారం, హైదరాబాద్ | సంపుటి:4 సంచిక: 84


## యుద్ధం వచ్చినా భయం లేదు

- పశ్చిమాసియా యుద్ధం వల్ల ఆహారం, ఇంధన సరఫరాకు ఆటంకం
- భారత్‌పై యుద్ధ ప్రభావం పడకుండా ప్రభుత్వం అన్ని చర్యలు
- సామాన్యులు, రైతులపై అదనపు భారం పడకుండా మోదీ హామీ
- ఇంధన సంక్షోభంపై ప్రజలను భయపెట్టవద్దని పార్టీలకు సూచన
- రూ. 11,200 కోట్లతో నోయిడా అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభం
- ప్రపంచంలో యుద్ధం ఉన్నా దేశంలో డెవలప్‌మెంట్ కొనసాగుతుంది



**విశాలభారతి, జాతీయం:**

ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాలో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన అంతర్జాతీయ విమానాశ్రయం మొదటి దశను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జేవర్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ దేశాభివృద్ధి, అంతర్జాతీయ పరిస్థితులపై కీలక విశ్లేషణ చేశారు. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న అస్థిరతను ప్రస్తావిస్తూనే, మిగతా 5లో..

## మూసీని అడ్డుకుంటే శివతాండవమే..!

### మూసీ తీరాన రూ. 700 కోట్లతో భారీ శివాలయ నిర్మాణం

నది మధ్యలో 100 అడుగుల శివుడి విగ్రహం, గాలిగోపురం

- ఆధ్యాత్మికతను జోడిస్తూ నదికి పూర్వవైభవం తెచ్చే ప్లాన్
- ప్రాజెక్టును అడ్డుకుంటే 'శివతాండవం' తప్పదని రేవంత్ వార్నింగ్
- నది ఒడ్డున ఆలయం, మసీదు, చర్చిల నిర్మాణం
- కొండపోచమ్మ సాగర్ నుంచి నీటిని మళ్లించి మూసీని నింపేలా చర్యలు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాజధాని హైదరాబాద్ నడిబొడ్డున ప్రవహించే మూసీ నది పునరుజ్జీవన దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. పర్యావరణ పరిరక్షణతో పాటు ఆధ్యాత్మికతను జోడిస్తూ చేపట్టిన ఈ భారీ ప్రాజెక్టులో భాగంగా మంచిరేవుల వద్ద ఓంకారేశ్వర ఆలయ నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఘనంగా శంకుస్థాపన చేశారు. ఈ చారిత్రాత్మక ఘట్టానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు పలువురు మంత్రులు, ఉన్నతాధికారులు సాక్ష్యంగా నిలిచారు. నగరం నడిబొడ్డున కలుషితమై ఉన్న మూసీకి పూర్వవైభవం తీసుకురావడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ బృహత్తర కార్యక్రమాన్ని తలపెట్టింది. ఆలయ నిర్మాణానికి సంబంధించిన పూర్తి స్థాయి నమూనాను మూసీ రివర్‌ఫ్రంట్ కార్పొరేషన్ ఇప్పటికే సిద్ధం చేసింది. చారిత్రక ప్రాశస్త్యం ఉన్న వీరభద్రస్వామి దేవాలయానికి సమీపంలోనే ఈ కొత్త ఆధ్యాత్మిక కేంద్రాన్ని నిర్మిస్తున్నారు. సుమారు ఎనిమిది ఎకరాల విస్తీర్ణంలో రూ.700 కోట్ల భారీ వ్యయంతో ఈ ప్రాజెక్టును చేపట్టనున్నారు. ప్రాచీన శిల్పకళ ఉట్టిపడేలా నిర్మించనున్న ఈ ఆలయం భవిష్యత్తులో హైదరాబాద్ నగరానికే ఒక ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. భక్తుల సౌకర్యార్థం అన్ని రకాల వసతులను ఇక్కడ కల్పించనున్నారు. ఈ ఆలయ నిర్మాణంలో ప్రధాన ఆకర్షణగా వంద అడుగుల ఎత్తైన గాలిగోపురం నిలవనుంది. సుదూర ప్రాంతాల నుండి సైతం మిగతా 4లో..



## ఆశాలపై ఉక్కుపాదం

- రూ.18,000 వేతనం చెల్లించాలని ఆశా వర్కర్ల డిమాండ్
- కాంగ్రెస్ ఎన్నికల హామీని అమలు చేయాలని అసెంబ్లీ ముట్టడి
- హైదరాబాద్ తరలివచ్చిన ఆశాలను అడ్డుకున్న పోలీసులు
- రాష్ట్రవ్యాప్తంగా నిరసనకారుల ముందస్తు అరెస్టులు
- తోపులాటలో పలువురు ఆశా వర్కర్లకు గాయాలు
- శాంతియుత నిరసనను అడ్డుకోవడంపై వర్కర్ల ఆగ్రహం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఆరోగ్య సేవల్లో కీలక భూమిక పోషిస్తున్న ఆశా కార్యకర్తలు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సమరశంఖం పూరించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ వారు చేపట్టిన అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం ఉద్రిక్తంగా మారింది. ప్రభుత్వ వైఖరికి నిరసనగా వివిధ జిల్లాల నుంచి వేలాదిగా తరలివచ్చిన మహిళా కార్యకర్తలతో రాజధాని వీధులు హోరెత్తాయి. తమకు రావాల్సిన వేతనం కోసం శాంతియుత మార్గంలో నిరసన తెలుపుతుంటే పోలీసులు అడ్డుకోవడంపై వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కును కాలరాయడం తగదని ఆవేదన వ్యక్తం చేస్తూ ఆందోళనను కొనసాగించారు. హైదరాబాద్ నగరంలోని ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద ఉదయం నుంచే ఆశా వర్కర్ల కోలాహలం మొదలైంది. జిల్లాల నుంచి వచ్చిన కార్యకర్తలు ప్లకార్డులు పట్టుకుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. గత ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా తమకు కనీస వేతనం కింద రూ. 18 వేలు చెల్లించాలని వారు గట్టిగా డిమాండ్ చేశారు. ప్రస్తుతమున్న చాలీచాలని గౌరవ వేతనంతో కుటుంబాలను పోషించుకోవడం భారంగా మారిందని వాపోయారు. ధర్నా చౌక్ వద్ద ప్రారంభమైన ఈ నిరసన క్రమంగా అసెంబ్లీ వైపు వెళ్లేందుకు ప్రయత్నించడంతో మిగతా 2లో..

## మూసీ ప్రాజెక్టు పేరిట భారీ అవినీతి

- మూసీ పేరుతో రూ.1.5 లక్షల కోట్ల స్కామ్‌కు ప్రభుత్వం ప్లాన్
- గ్యారెంటీలకు లేని డబ్బు, మూసీకి ఎక్కడి నుంచి వస్తుందని ప్రశ్న
- కమీషన్ల కోసమే ప్రాజెక్టు వ్యయాన్ని భారీగా పెంచారని ఆరోపణ




03

## పొంగులేటి కంపెనీపై సీఎం 'విచారణాస్త్రం'



- రాఘవ కన్ స్ట్రక్షన్స్‌పై అక్రమ మైనింగ్ ఆరోపణల
- విచారణకు ఆదేశించిన సీఎం రేవంత్ రెడ్డి
- ప్రభుత్వ ఖజానాకు గండి కొట్టారని ఫిర్యాదు
- సీఐడీ విచారణతో మంత్రి పొంగులేటికి చిక్కులు
- సొంత మంత్రిపైనే రేవంత్ విచారణాస్త్రం
- కంట్రోల్ చేసే వ్యూహమని రాజకీయ చర్చ

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాజకీయాల్లో అనూహ్య పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. రాష్ట్ర మంత్రివర్గంలో అత్యంత కీలకమైన శాఖలు నిర్వహిస్తున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి కుటుంబానికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్ సంస్థపై సీఐడీ విచారణకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించడం సర్వత్రా చర్చనీయాంశమైంది. అక్రమ మైనింగ్ ఆరోపణల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకోవడం పాలనా పరంగానే కాకుండా రాజకీయంగానూ ప్రకంపనలు సృష్టిస్తోంది. ప్రభుత్వ ఖజానాకు భారీగా గండి కొట్టారన్న ఫిర్యాదులపై పూర్తిస్థాయిలో దర్యాప్తు జరపాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. స్వపక్షంలోని ఒక ముఖ్య నేతపైనే ఇలా విచారణకు ఆదేశించడం వెనుక ఉన్న మర్మమేమిటన్న దానిపై రకరకాల ఊహాగానాలు మొదలయ్యాయి. రాఘవ కన్‌స్ట్రక్షన్స్ సంస్థపై ఇటీవలి కాలంలో ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా మైనింగ్ సాగించి కోట్లాది రూపాయల మేర ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలిగించారనేది ప్రధాన ఆరోపణ. హైదరాబాద్ శివారు ప్రాంతాలతో పాటు ఖమ్మం జిల్లాలోనూ ఈ సంస్థ భారీ ఎత్తున అక్రమాలకు పాల్పడినట్లు ప్రత్యర్థి పార్టీలు మిగతా 2లో..

## అసెంబ్లీలో మైనింగ్ ప్రకంపనలు



- రాఘవ కన్స్ట్రక్షన్స్ అక్రమాలకు పాల్పడుతోందని హరీశ్ రావు ఆరోపణ
- విచారణ కోసం మంత్రి పొంగులేటి రాజీనామా చేయాలని డిమాండ్
- తన ఆరోపణలు తప్పని తేలితే ఉరిశిక్షకైనా సిద్ధమని సవాల్
- ఆ కంపెనీతో పొంగులేటికి సంబంధం లేదని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టీకరణ
- పదేళ్ల బీఆర్ఎస్ పాలనపైనే విచారణ జరపాలని మంత్రి సీతక్క డిమాండ్
- హౌస్ కమిటీ కోసం బీఆర్ఎస్ పట్టుబట్టడంతో అసెంబ్లీలో తీవ్ర గందరగోళం

03



## కాళేశ్వరం అవినీతిపై రేవంత్ సైలెంట్



03

- కొత్త పార్టీ పెట్టే హక్కు ఎవరికైనా ఉందని కవిత నిర్ణయానికి మద్దతు
- కాళేశ్వరం ప్రాజెక్టు వైఫల్యానికి కేసీఆరే ప్రధాన కారణమని విమర్శ
- టోపీ పెట్టుకుని కేసీఆరే డిజైన్ చేయడం వల్లే వేల కోట్లు వృథా అని ఎద్దేవా
- సీఎం ఉపయోగిస్తున్న భాష తెలంగాణ సమాజం తలదించుకునేలా ఉంది

## ప్రజల సొమ్ముతో ఆటలా..!

- క్రీడాకారుల పాత బకాయిలు చెల్లించకుండా కోట్లతో వేడుకలు
- సామాన్య క్రీడాకారులకు ఒరిగేదేమీ లేని ఖరీదైన ఈవెంట్
- ఎల్బీ స్టేడియంలో వసతులు లేకున్నా పట్టించుకోని వైనం
- క్రీడల సాక్షిగా ప్రత్యర్థులపై విమర్శలకే ప్రాధాన్యత
- శిక్షణకు వాడాల్సిన నిధులను హంగు ఆర్భాటాలకు వృథా చేయడం
- క్షేత్రస్థాయిలో విఫలమై, కేవలం ప్రసంగాలతో బురదజల్లడం
- పల్లెల్లో ప్రతిభావంతులకు అందని ప్రోత్సాహకాలు
- స్పోర్ట్స్ కోటా ఉద్యోగాల భర్తీలో తీవ్ర జాప్యం
- ప్రజాప్రతినిధుల వినోదం కోసం కోట్ల రూపాయల ఖర్చు

02



## యుద్ధరంగంలోకి దూకిన హౌతీ రెబల్స్

- ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ దాడులు మొదలై నెల పూర్తి
- ఇన్నాళ్లూ మౌనంగా ఉన్న యెమెన్ హూతీలు యుద్ధంలోకి
- ఇజ్రాయెల్ సైనిక స్థావరాలే లక్ష్యంగా హూతీల ఎటాక్
- హూతీల క్షిపణులను కూల్చివేసినట్లు ఇజ్రాయెల్ ప్రకటన
- సుప్రీం లీడర్ హత్య తర్వాత తొలిసారి హూతీల స్పందన
- హూతీల రాకతో యుద్ధం మరింత తీవ్రమయ్యే ఛాన్స్

02



## పొంగులేటి కంపెనీపై సీఎం 'విచారణాస్త్రం'

**మొదటిపేజీ తరువాయి**



గట్టిగా వాదిస్తున్నాయి. ముఖ్యంగా బీఆర్ఎస్ నాయకత్వం ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణిస్తూ ప్రభుత్వ తీరును నిలదీస్తోంది. ఇన్ని ఆరోపణల మధ్య మౌనంగా ఉంటే విపక్షాలకు అవకాశం ఇచ్చినట్లవుతుందని భావించిన రేవంత్ రెడ్డి నేరుగా సీఐడీ విచారణకే మొగ్గు చూపినట్లు కనిపిస్తోంది.సొంత కేబినెట్‌లోని సహచర మంత్రి కుటుంబ సంస్థపైనే విచారణ జరిపించడం రాజకీయ వర్గాల్లో పెను సంచలనంగా మారింది. సాధారణంగా అధికార పార్టీ నేతలపై వచ్చే ఆరోపణలను కప్పిపుచ్చుకోవడానికి ప్రయత్నాలు జరుగుతుంటాయి. అందుకు భిన్నంగా రేవంత్ రెడ్డి తీసుకున్న ఈ నిర్ణయం ఆయన దూకుడుకు నిదర్శనమని కొందరు విశ్లేషిస్తున్నారు. రాఘవ కన్‌స్ట్రక్షన్స్ ఇదివరకే పలు వివాదాల్లో చిక్కుకుని ఉండటంతో ఇప్పుడు ప్రభుత్వం కూడా రంగంలోకి దిగడం ఆసక్తికరంగా మారింది. సీఐడీ దర్యాప్తు ప్రారంభమైతే అది కేవలం సంస్థ వ్యవహారాలకే పరిమితం కాకుండా మంత్రి పొంగులేటి రాజకీయ భవిష్యత్తును కూడా ప్రభావితం చేసే అవకాశం ఉంది. విచారణ ప్రక్రియలో గనుక అక్రమాలు రుజువైతే అది సంస్థకు మాత్రమే కాకుండా మంత్రి పదవికి కూడా పెను ముప్పుగా పరిణమించవచ్చు. నైతిక విలువల దృష్ట్యా పదవి నుంచి తప్పుకోవాలనే ఒత్తిడి పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే ఖమ్మం రాజకీయాల్లో తనకంటూ ఒక ప్రత్యేక ముద్ర వేసుకున్న పొంగులేటి చుట్టూ ఇప్పుడు దర్యాప్తు ఉచ్చు బిగుస్తోంది. భవిష్యత్తులో సీఐడీ సమర్పించే నివేదిక తెలంగాణ రాజకీయాల్లో ఎటువంటి మలుపులు తిప్పుతుందోనని రాజకీయ పరిశీలకులు ఆసక్తిగా గమనిస్తున్నారు. ఈ నివేదిక ఆధారంగానే తదుపరి చర్యలు ఉంటాయని ప్రభుత్వం సంకేతాలిస్తోంది. సీఐడీ అనేది రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యక్ష నియంత్రణలో ఉండే విభాగం కావడంతో ఈ విచారణ ఎంత నిష్పక్షపాతంగా సాగుతుందనే అనుమానాలు కూడా విపక్షాల నుంచి వ్యక్తమవుతున్నాయి. ఇది కేవలం కంటితుడుపు చర్యగా మిగిలిపోతుందా లేక నిజంగానే అక్రమాలను వెలికితీస్తుందా అన్నది వేచి చూడాలి. విపక్షాలు మాత్రం ఈ విషయంలో రాజీ పడేలా కనిపించడం లేదు. ప్రభుత్వంలోని పెద్దల అండదండలు లేకుండానే ఇంత పెద్ద ఎత్తున అక్రమ మైనింగ్ జరగడం సాధ్యం కాదని వారు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో సీఐడీ పైనే ఇప్పుడు గురుతర బాధ్యత ఉంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నిర్ణయాన్ని చాలా వ్యూహాత్మకంగా తీసుకున్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. పొంగులేటి శ్రీనివాస రెడ్డికి ప్రజల్లో ఉన్న పట్టును దృష్టిలో ఉంచుకుని ఆయనను కొంతమేర కట్టడి చేయడానికే ఈ అస్త్రాన్ని ప్రయోగించినట్లు తెలుస్తోంది. ఇటీవల కాలంలో కొన్ని విషయాల్లో పొంగులేటి వ్యవహార శైలిపై రేవంత్ కొంత అసంతృప్తితో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఆయనను తమ నియంత్రణలో ఉంచుకోవడానికి ఇలాంటి కేసులు ప్రభుత్వ గుప్పిట్లో ఉండటం మేలని అధిష్ఠానం ఆలోచిస్తున్నట్లు సమాచారం. ఇది ఒక రకంగా చెక్ పెట్టే చర్యగానే కనిపిస్తోంది. ఈ కేసు ద్వారా రేవంత్ రెడ్డి ఒకే దెబ్బకు రెండు పిట్టలు అన్న చందంగా ప్రయోజనం పొందే అవకాశం ఉంది. మొదటిది సొంత మంత్రిపైనే విచారణ జరిపిస్తున్నాననే సంకేతం ప్రజల్లోకి పంపడం ద్వారా తన నిజాయితీని నిరూపించుకోవడం. తప్పు ఎవరు చేసినా ఉపేక్షించేది లేదని ఆయన చాటిచెప్పినట్లవుతుంది. రెండోది పొంగులేటి వంటి బలమైన నాయకుడు తన పరిధి దాటి వెళ్లకుండా కట్టడి చేయడం. ఏవైనా రాజకీయ సమీకరణలు మారినా ఈ కేసును అడ్డు పెట్టుకుని ఒత్తిడి తీసుకువచ్చే వీలుంటుందని రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. మరోవైపు కాంగ్రెస్ పార్టీలోని అంతర్గత సమీకరణలు కూడా ఈ విచారణపై ప్రభావం చూపే అవకాశం ఉంది. పార్టీలో పొంగులేటి ఎదుగుదల నచ్చని కొందరు నేతలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని ఆయనను ఒంటరిని చేసే ప్రయత్నం చేస్తున్నారు.

# యుద్ధరంగంలోకి దూకిన హూతీ రెబల్స్

**విశాలభారతి, అంతర్జాతీయం:**

పశ్చిమ ఆసియాలో యుద్ధ జ్వాలలు మళ్లీ భయంకరంగా ఎగసిపడుతున్నాయి. అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా ఇరాన్‌పై చేపట్టిన సైనిక చర్య నెల రోజులు పూర్తి చేసుకున్న తరుణంలో యుద్ధం మరో మలుపు తిరిగింది. ఒకవైపు ఇరు దేశాల మధ్య దాడులు, ప్రతిదాడులు తీవ్రతరమవుతుండగా, మరోవైపు అంతర్జాతీయ సమాజం కాల్పుల విరమణ కోసం గట్టి ప్రయత్నాలు చేస్తోంది. ఈ ఉత్కంఠభరిత పరిస్థితుల్లో ఇరాన్‌కు బద్ధ మద్దతుదారులైన యెమెన్‌కు చెందిన హూతీ రెబల్స్ నేరుగా రణరంగంలోకి దూకడం ప్రపంచ దేశాలను ఉలిక్కిపడేలా చేసింది. హూతీల తాజా చర్యతో ఈ ప్రాంతంలో యుద్ధం మరింత విస్తరించే ప్రమాదం కనిపిస్తోంది.



హూతీలు తాజాగా ఇజ్రాయెల్‌లోని కీలక సైనిక స్థావరాలే లక్ష్యంగా క్షిపణి దాడులకు తెగబడ్డారు. యెమెన్ భూభాగం నుంచి ప్రయోగించిన ఈ క్షిపణులు ఇజ్రాయెల్ సరిహద్దులను తాకాయి. ఈ విషయాన్ని హూతీల అధికార ప్రతినిధి యాహ్యా సారె స్వయంగా ధ్రువీకరించారు. ఇరాన్‌పై జరుగుతున్న దాడులకు నిరసనగా తాము ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన ప్రకటించారు. ఇజ్రాయెల్ దురాగతాలకు ముగింపు పలకడమే తమ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. హూతీల ఈ ఆకస్మిక దాడి ఇజ్రాయెల్ రక్షణ యంత్రాంగాన్ని అప్రమత్తం చేసింది. హూతీల దాడికి కొన్ని గంటల ముందే ఇజ్రాయెల్ సైన్యం ఒక ప్రకటన విడుదల చేసింది. యెమెన్ దిశ నుంచి తమ భూభాగంపైకి ఒక శక్తివంతమైన క్షిపణి దూసుకొచ్చిందని వారు గుర్తించారు. అయితే ఇజ్రాయెల్‌కు ఉన్న అత్యాధునిక గగనతల రక్షణ వ్యవస్థలు ఆ క్షిపణిని గాలిలోనే అడ్డుకున్నాయి. శత్రువుల దాడులను తిప్పికొట్టడంలో తాము సిద్ధంగా ఉన్నామని ఇజ్రాయెల్ సైనిక వర్గాలు తెలిపాయి. ఈ ఘటనలో ఎటువంటి ప్రాణ నష్టం గానీ, ఆస్తి నష్టం గానీ జరగలేదని ప్రాథమిక సమాచారం అందుతోంది. రక్షణ వ్యవస్థలు సమర్థంగా పనిచేయడం వల్ల పెద్ద ప్రమాదం తప్పిందని విశ్లేషకులు భావిస్తున్నారు. అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం యెమెన్ నుంచి వచ్చిన క్షిపణిని ఇజ్రాయెల్ సరిహద్దు దాటకముందే కూల్చివేసింది. హూతీలు తమ శక్తిని చాటుకోవడానికి ఇలాంటి దాడులకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. గతంలో కూడా హూతీలు ఇజ్రాయెల్ లక్ష్యంగా డ్రోన్లు, క్షిపణులను ప్రయోగించిన సందర్భాలు ఉన్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో వారు యుద్ధంలోకి రావడం ఇరాన్ కూటమి బలాన్ని పెంచేలా కనిపిస్తోంది. ఇది కేవలం ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య పోరాటమే కాకుండా ప్రాంతీయ ఆధిపత్య పోరుగా మారుతోంది. అమెరికా జోక్యం పెరగడం వల్ల హూతీలు మరింత ఆగ్రహంతో ఉన్నట్లు స్పష్టమవుతోంది. గతంలో గాజాపై ఇజ్రాయెల్ దాడులు చేసిన సమయంలో హూతీలు అత్యంత క్రియాశీలంగా వ్యవహరించిన సంగతి తెలిసిందే. పాలస్తీనీయులకు మద్దతుగా వారు ఎర్ర సముద్రం, గల్ఫ్ ఆఫ్ ఏడెన్ మార్గాల్లో వెళ్లే నౌకలను టార్గెట్ చేశారు. అంతర్జాతీయ వాణిజ్య నౌకలపై దాడులు చేయడం ద్వారా ప్రపంచ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసే ప్రయత్నం చేశారు. ఆ సమయంలో హూతీల దాడులు ఇజ్రాయెల్‌తో పాటు దాని మిత్ర దేశాలకు పెద్ద తలనొప్పిగా మారాయి. నౌకాయాన మార్గాలను రక్షించడానికి అమెరికా ప్రత్యేక బలగాలను మోహరించాల్సి వచ్చింది. అప్పుడు హూతీల ప్రభావం ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్త దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ హతమైనట్లు వార్తలు రావడం సంచలనం సృష్టించింది. ఆ తదనంతరం ఇరాన్ వ్యాప్తంగా భీకర దాడులు జరుగుతున్నప్పటికీ హూతీలు కొంతకాలం మౌనంగా ఉండిపోయారు. ఇరాన్ కీలక నేతలు మరణించినప్పుడు కూడా హూతీలు వెంటనే స్పందించకపోవడంపై అంతర్జాతీయ స్థాయిలో భిన్న చర్చలు నడిచాయి. వారు ఎందుకు మౌనం వహించారనే దానిపై రక్షణ నిపుణులు రకరకాల విశ్లేషణలు చేశారు. హూతీలు తమ వ్యూహాలను మార్చుకుంటున్నారా లేక బలగాలను సమీకరించుకుంటున్నారా అనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఆ మౌనాన్ని వీడుతూ ఇప్పుడు వారు నేరుగా దాడులకు దిగారు. ప్రస్తుత దాడి హూతీల వ్యూహాత్మక మార్పును సూచిస్తోంది. ఇరాన్ తీవ్ర సంక్షోభంలో ఉన్న తరుణంలో తమ మద్దతు తెలపడం వారికి తప్పనిసరి అయింది. హూతీల ప్రమేయం వల్ల ఎర్ర సముద్రంలో మళ్లీ ఉద్రిక్తతలు పెరిగే అవకాశం ఉంది. ఈ మార్గంలో ప్రయాణించే వాణిజ్య నౌకలు ఇప్పుడు మళ్లీ భయాందోళనలకు గురవుతున్నాయి. ఇజ్రాయెల్‌కు వెళ్లే ఏ వస్తువునైనా అడ్డుకుంటామని హూతీలు హెచ్చరిస్తున్నారు. ఇది ఇజ్రాయెల్ ఆర్థిక వ్యవస్థపై పరోక్షంగా ఒత్తిడి తెచ్చే ప్రయత్నంగా కనిపిస్తోంది. యుద్ధం క్షేత్రస్థాయి నుంచి సముద్ర మార్గాలకు కూడా విస్తరిస్తోంది.

ఇజ్రాయెల్ ప్రభుత్వం హూతీల దాడులను ఏమాత్రం ఉపేక్షించబోమని హెచ్చరించింది. తమ దేశ రక్షణ కోసం ఎంతటి కఠిన నిర్ణయాలకైనా వెనుకాడబోమని ప్రధాని కార్యాలయం స్పష్టం చేసింది. హూతీల స్థావరాలపై ఇజ్రాయెల్ ప్రతీకార దాడులు చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఇప్పటికే యెమెన్‌లోని హుదైదా పోర్టుపై గతంలో ఇజ్రాయెల్ దాడులు చేసి భారీ నష్టాన్ని కలిగించింది. ఇప్పుడు మళ్లీ అదే తరహా చర్యలు తీసుకుంటే యెమెన్‌లో మానవతా సంక్షోభం మరింత ముదిరే ప్రమాదం ఉంది. ఇరు పక్షాల పంతం వల్ల సామాన్య ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. అమెరికా ఈ పరిణామాలను నిశితంగా గమనిస్తోంది. ఇరాన్‌పై ఒత్తిడి పెంచే క్రమంలో దాని మిత్ర దేశాలను కూడా కట్టడి చేయాలని అగ్రరాజ్యం భావిస్తోంది. హూతీలకు అందుతున్న ఆయుధ సరఫరాను అడ్డుకోవడానికి అమెరికా నౌకాదళం నిరంతరం నిఘా ఉంచుతోంది. అయినప్పటికీ హూతీలు అధునాతన క్షిపణులను ప్రయోగించడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఇరాన్ నుంచి వారికి రహస్యంగా సాంకేతిక సాయం అందుతోందని అమెరికా ఆరోపిస్తోంది. ఈ ఆరోపణలు యుద్ధ వాతావరణాన్ని మరింత వేడెక్కిస్తున్నాయి. ప్రపంచ దేశాలు రెండు వర్గాలుగా విడిపోయే పరిస్థితి కనిపిస్తోంది. మరోవైపు ఐక్యరాజ్యసమితి శాంతి కోసం విజ్ఞప్తి చేస్తోంది. యుద్ధం వల్ల పశ్చిమ ఆసియాలోని దేశాలన్నీ ఆర్థికంగా చితికిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తోంది. కాల్పుల విరమణ ఒప్పందం కుదిరితేనే సాధారణ పరిస్థితులు నెలకొంటాయని రాయబారులు చర్చలు జరుపుతున్నారు. కానీ ఇటు ఇజ్రాయెల్, అటు ఇరాన్ కూటమి వెనక్కి తగ్గడం లేదు. హూతీల ఎంట్రీతో ఈ చర్చలు మరింత క్లిష్టంగా మారే అవకాశం ఉంది. శాంతి చర్చలు ఒకవైపు జరుగుతుంటే, దాడులు మరోవైపు కొనసాగడం విషాదకరం. ఈ ప్రతిష్టంభన ఎన్నాళ్లు కొనసాగుతుందో ఎవరూ ఊహించలేకపోతున్నారు. యుద్ధం నెల రోజులు పూర్తి చేసుకున్న వేళ ఈ పరిణామాలు గమనిస్తే ముగింపు దరిదాపుల్లో లేదనిపిస్తోంది. హూతీలు యుద్ధంలోకి దిగడం అనేది ఒక హెచ్చరిక లాంటిది. ఇరాన్ ఒంటరిది కాదని చెప్పడమే వారి ఉద్దేశం కావచ్చు. భవిష్యత్తులో లెబనాన్‌లోని హిజ్బుల్లా కూడా తన దాడులను తీవ్రం చేస్తే పరిస్థితి చేయి దాటిపోయే ప్రమాదం ఉంది. మధ్యప్రాచ్యంలో స్థిరత్వం కలగా మిగిలిపోయేలా ఉంది. మానవతా దృక్పథంతో ఆలోచించి అన్ని దేశాలు సంయమనం పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ రక్తపాతం ఆగిపోయి శాంతి వచనాలు వినిపించాలని లోకం కోరుకుంటోంది.

# ప్రజల సొమ్ముతో ఆటలా..!

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ క్రీడారంగం ప్రస్తుతం ఆర్భాటాల నడుమ కొట్టుమిట్టాడుతోంది. రాష్ట్ర రాజధాని నడిబొడ్డున ఉన్న చారిత్రక ఎల్బీ స్టేడియం వేదికగా సాగుతున్న ప్రజాప్రతినిధుల క్రీడా సంబరాలు సామాన్య క్రీడాకారుల పాలిట శాపంగా మారాయి. కోట్లాది రూపాయల ప్రజా ధనాన్ని కేవలం నాయకుల వినోదం కోసం, వారి మానసిక ఉల్లాసం కోసం ఖర్చు చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మైదానంలో చెమటోడ్చి దేశానికి పతకాలు తెచ్చే క్రీడాకారులకు ఇవ్వాల్సిన పాత బకాయిలను గాలికి వదిలేసిన సర్కారు, ఇలాంటి ఖరీదైన ఈవెంట్ల ద్వారా ప్రజల కళ్లకు గంతలు కట్టే ప్రయత్నం చేస్తోంది. క్షేత్రస్థాయిలో క్రీడాకారులకు ఒరిగేదేమీ లేని ఈ ఆడంబరాలు కేవలం ప్రచారానికే పరిమితమవుతున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా జెండా ఊపి ప్రారంభించిన ఈ వేడుకలు క్రీడా స్ఫూర్తి కంటే రాజకీయ విమర్శలకే వేదికగా మారడం విచారకరం. ఒత్తిడిలో ఉన్న నాయకులకు ఆటలు అవసరమని చెబుతున్న పాలకులు, మైదానాలు లేక వీధుల్లో ఆడుకుంటున్న గ్రామీణ క్రీడాకారుల ఒత్తిడిని మాత్రం గుర్తించడం లేదు. క్రీడల సాక్షిగా ప్రత్యర్థులపై బురదజల్లడమే ప్రధాన అజెండాగా సాగుతున్న ఈ కార్యక్రమంలో అసలైన క్రీడాకారుల గోడు ఎవరికీ వినిపించడం లేదు. శిక్షణకు, క్రీడా పరికరాలకు వాడాల్సిన నిధులను ఇలాంటి హంగు ఆర్భాటాలకు వృథా చేయడం ప్రభుత్వ అనాలోచిత వైఖరికి నిదర్శనం. గత పాలకుల కంటే మెరుగ్గా చేస్తామని చెబుతున్న మాటలు కేవలం కాగితాలకే పరిమితమవుతున్నాయి. రాష్ట్ర ఏర్పాటు తర్వాత క్రీడలు నిర్లక్ష్యానికి గురయ్యాయని పదేపదే విమర్శిస్తున్న ప్రస్తుత ప్రభుత్వం, ఆ పరిస్థితిని మార్చడంలో విఫలమైంది. కొత్త క్రీడా విధానం అంటూ భారీ ప్రకటనలు చేస్తున్నా, అమలులో మాత్రం శూన్యం కనిపిస్తోంది. పల్లెల్లో ప్రతిభావంతులైన యువతకు కనీస ప్రోత్సాహకాలు అందడం లేదు. జిల్లా కేంద్రాల్లోని క్రీడా మైదానాలు పశువుల మేతకు నిలయాలుగా మారుతున్నా పట్టించుకునే నాథుడే లేడు. సీఎం కప్ పేరుతో నిర్వహించిన పోటీలు కేవలం ఫోటోలకు, వార్తలకు మాత్రమే పరిమితమయ్యాయి తప్ప, అందులో



గెలిచిన వారికి కనీస ఆర్థిక సాయం కూడా సకాలంలో అందడం లేదనేది పచ్చి నిజం.

ప్రపంచ ప్రఖ్యాత ఫుట్‌బాల్ ఆటగాడు లియోనెల్ మెస్సీని హైదరాబాద్‌కు ఆహ్వానించడంపై సాగుతున్న ప్రచారం ఇప్పుడు పెను వివాదానికి దారితీసింది. కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని వెచ్చించి ఒక విదేశీ క్రీడాకారుడిని తీసుకురావడం వల్ల స్థానిక క్రీడాకారుల తలరాతలు మారుతాయా అనే ప్రశ్నకు సమాధానం లేదు. మెస్సీని తీసుకురావడాన్ని సమర్థించుకుంటూ ప్రతిపక్షాలపై విమర్శలు చేయడం క్రీడలను మరింత రాజకీయం చేయడమే. రాష్ట్రంలో వేల సంఖ్యలో ఉన్న ప్రతిభావంతులకు ఒక్క రూపాయి కూడా విదల్చని ప్రభుత్వం, ఒకే ఒక్క ఈవెంట్ కోసం కోట్ల రూపాయలు తగలేయడం ఏ రకమైన సంస్కరణో పాలకులు వివరించాలి.

యువత పెడదోవ పడుతోందని, డ్రగ్స్ సంస్కృతి పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్న ముఖ్యమంత్రి, దానికి గల కారణాలను విశ్లేషించడంలో విఫలమవుతున్నారు. మైదానాలు అందుబాటులో లేకపోవడం, క్రీడలకు సరైన బడ్జెట్ కేటాయించకపోవడం వల్లే యువత ప్రత్యామ్నాయాల వైపు చూస్తున్నారు. ఫామ్‌హౌస్‌లు, పబ్బుల సంస్కృతిని విమర్శిస్తున్న ప్రభుత్వం, వాటి నియంత్రణలో ఎందుకు పట్టు సాధించలేకపోతోందో స్పష్టం చేయడం లేదు. ప్రసంగాల్లో నీతులు చెప్పడం మానేసి, పాఠశాల స్థాయి నుంచే క్రీడలను ఒక సబ్జెక్టుగా ప్రవేశపెట్టడంలో చూపిస్తున్న జాప్యం యువత భవిష్యత్తును అంధకారంలోకి నెడుతోంది. రాష్ట్రంలోని క్రీడా మౌలిక సదుపాయాల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉంది. అట్టహాసంగా వేడుకలు నిర్వహిస్తున్న ఎల్బీ స్టేడియం లోపలికి వెళ్లి చూస్తే వసతుల లేమి కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. డ్రెస్సింగ్ రూమ్‌లు శిథిలావస్థకు చేరాయి, మరుగుదొడ్ల నిర్వహణ అధ్వాన్నంగా ఉంది. చిన్నపాటి వర్షానికే మైదానం చెరువును తలపిస్తున్నా శాశ్వత పరిష్కారం చూపడంలో అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేస్తామన్న హామీలు కేవలం ఎన్నికల హామీలుగానే మిగిలిపోయాయి. నిధుల కేటాయింపులో చిత్తశుద్ధి లోపించడం వల్లే తెలంగాణ క్రీడారంగం కునారిల్లుతోంది. పాత బకాయిల కోసం క్రీడాకారులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా కనికరించని సర్కారు, ప్రజాప్రతినిధుల విందు వినోదాల కోసం మాత్రం నిమిషాల్లో నిధులు విడుదల చేస్తోంది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మెడల్స్ సాధించిన వారికి ఇవ్వాల్సిన నగదు పురస్కారాలు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్నాయి. ఆకలితో అలమటిస్తున్న క్రీడాకారులకు అండగా నిలవాల్సిన ప్రభుత్వం, వారి ఆవేదనను రాజకీయ విమర్శలతో అణచివేయాలని చూడటం దారుణం. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న క్రీడా వాతావరణం నేడు మచ్చుకైనా కనిపించడం లేదని క్రీడా విశ్లేషకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత పాలనలో క్రీడల కంటే రాజకీయ ప్రయోజనాలకే పెద్దపీట వేస్తున్నారు. క్రీడా సంఘాల మధ్య ఉన్న గ్రూపు తగాదాలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం, వాటిలో తన రాజకీయ అనుచరులను జొప్పించి పబ్బం గడుపుకుంటోంది. దీనివల్ల పారదర్శకమైన ఎంపిక ప్రక్రియ దెబ్బతిని, కేవలం సిఫార్సులు ఉన్న వారికే అవకాశాలు దక్కుతున్నాయి. అసలైన ప్రతిభావంతులు మైదానాలకు దూరమవుతున్నారు. బడ్జెట్ కేటాయింపుల్లో క్రీడలకు ఇచ్చేది తక్కువ, చెప్పే గొప్పలు మాత్రం కొండంత అన్నట్లుగా పరిస్థితి తయారైంది. వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి గత ప్రభుత్వంపై బురద చల్లడం ఇప్పుడు పరిపాటిగా మారింది.

అన్నింటికంటే ముఖ్యంగా స్పోర్ట్స్ కోటా ఉద్యోగాల భర్తీలో జరుగుతున్న జాప్యం యువ క్రీడాకారుల పాలిట శరాఘాతంగా మారింది. క్రీడల్లో రాణించి దేశానికి గౌరవం తెచ్చిన వారికి ఉద్యోగ భద్రత కల్పించడంలో సర్కారు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోంది. దీనివల్ల ప్రతిభ ఉన్న వారు పొరుగు రాష్ట్రాలకు వలస వెళ్తున్నారు. పతకాలు సాధించినా గుర్తింపు లేక, ఉపాధి దొరకక ఎందరో క్రీడాకారులు కూలీ పనులకు వెళ్తున్న దైన్యం తెలంగాణలో నెలకొంది. కేవలం ప్రసంగాలతో కడుపు నిండదని, ఆచరణాత్మకమైన మార్పులు అవసరమని క్రీడా ప్రేమికులు డిమాండ్ చేస్తున్నారు. పాఠశాలల్లో శారీరక విద్య ఉపాధ్యాయుల కొరత పీడిస్తున్నా భర్తీ ప్రక్రియ పట్టాలెక్కడం లేదు. వ్యాయామ విద్య లేని విద్యా వ్యవస్థలో క్రీడాకారులు ఎలా పుట్టుకొస్తారో పాలకులు ఆలోచించాలి. ప్రైవేట్ స్కూళ్లు ప్లే గ్రౌండ్స్ లేకుండానే కొనసాగుతున్నా విద్యాశాఖ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. క్రీడలను ఒక వినోద సాధనంగానే చూస్తున్నారే తప్ప, వాటిని ఒక కెరీర్‌గా తీర్చిదిద్దే ప్రయత్నం జరగడం లేదు. రాజధానిలో రంగుల హంగులతో వేడుకలు జరుపుకుంటే సరిపోదు, మారుమూల గ్రామంలోని ప్రతిభకు ఆసరా అందించినప్పుడే క్రీడల అభివృద్ధి సాధ్యమవుతుంది.

చెప్పాలంటే, ముఖ్యమంత్రి పర్యటనలు, ప్రజాప్రతినిధుల ఆటలు కేవలం ప్రజాధనం వృథా తప్ప మరొకటి కాదు. క్రీడాకారుల ఆశయాలను గౌరవించకుండా, వారి సమస్యలను పరిష్కరించకుండా చేసే ఎలాంటి వేడుకలైనా నిరర్థకమే. రాజకీయ పంతాలు నెగ్గించుకోవడానికి మైదానాలను వేదికగా మార్చుకోవడం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు. ఇప్పటికైనా ప్రభుత్వం ఆర్భాటాలు తగ్గించి, వాస్తవ సమస్యలపై దృష్టి సారించాలి. లేనిపక్షంలో తెలంగాణ క్రీడారంగం కోలుకోలేని విధంగా దెబ్బతినే ప్రమాదం ఉంది. అప్పుడు కేవలం ప్రసంగాలు మిగులుతాయి తప్ప, పతకాలు సాధించే వీరులు కనుమరుగవుతారు.

## 'ఆశా'లపై ఉక్కుపాదం



**మొదటిపేజీ తరువాయి**

ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. శాంతిభద్రతల సాకుతో పోలీసులు ఆశా కార్యకర్తలను ఎక్కడికక్కడ నిలువరించే ప్రయత్నం చేశారు. నిరసనకారులు భారీగా గుమిగూడటంతో వారందరినీ వ్యాన్లలోకి ఎక్కించి బలవంతంగా అరెస్టు చేశారు. పోలీసుల తీరును నిరసిస్తూ మహిళా కార్యకర్తలు రోడ్లపైనే బైఠాయించి ఆందోళన చేపట్టారు. తమ నిరసనకు ముందస్తు అనుమతి ఉన్నప్పటికీ పోలీసులు ఇలా అనాగరికంగా వ్యవహరించడం దారుణమని మండిపడ్డారు. అరెస్టుల సమయంలో చోటుచేసుకున్న తోపులాటలో పలువురు మహిళలకు స్వల్ప గాయాలయ్యాయి. రక్షక భటులే తమపై ప్రతాపం చూపడం పట్ల వారు కన్నీటి పర్యంతమయ్యారు. అసెంబ్లీ ముట్టడి పిలుపు నేపథ్యంలో పోలీసులు రాష్ట్రవ్యాప్తంగా ముందస్తు చర్యలు చేపట్టారు. కరీంనగర్ జిల్లా నుంచి చలో అసెంబ్లీకి బయలుదేరిన ఆశా వర్కర్ల బృందాన్ని రేణికుంట టోల్ గేట్ వద్ద అడ్డుకున్నారు. ప్రయాణిస్తున్న బస్సుల నుంచి వారిని కిందికి దింపేయడంతో కార్యకర్తలు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. తమ సమస్యలపై గళమెత్తే స్వేచ్ఛ కూడా లేదా అని వారు అధికారులను నిలదీశారు. ప్రభుత్వం ప్రతి చిన్న ఆరోగ్య కార్యక్రమానికి తమ సేవలను వాడుకుంటుందని గుర్తు చేశారు. క్షేత్రస్థాయిలో కష్టపడి పని చేస్తున్న తమ పట్ల పాలకులు చూపిస్తున్న వివక్షను ఎండగట్టారు. ఆర్టీసీ క్రాస్ రోడ్డు పరిసర ప్రాంతాల్లో ఆశా కార్యకర్తల నిరసన తీవ్ర రూపం దాల్చింది. అసెంబ్లీ వైపు దూసుకెళ్లేందుకు ప్రయత్నించిన కార్యకర్తలను పోలీసులు చెదరగొట్టారు. ఈ క్రమంలో నిరసనకారులకు పోలీసులకు మధ్య తోపులాట చోటుచేసుకుని పరిస్థితి అదుపు తప్పింది. కొంతమంది కార్యకర్తలు అస్వస్థతకు గురికాగా మరికొందరికి గాయాలయ్యాయి. గర్భిణులు బాలింతల ఆరోగ్యం నుంచి పారిశుద్ధ్యం వరకు ప్రతి పనిలో భాగస్వాములయ్యే తమకు ఈ అవమానం ఏంటని వారు ప్రశ్నించారు. భారీగా మోహరించిన బలగాలు ఆందోళనకారులను అదుపులోకి తీసుకుని సమీపంలోని పోలీస్ స్టేషన్లకు తరలించాయి. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తమకు అండగా ఉంటామని చెప్పారని ఆశా కార్యకర్తలు గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలను విస్మరించడం నమ్మకద్రోహమని విమర్శించారు. రూ. 18 వేల వేతనం ఇస్తామన్న మాటను నిలబెట్టుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు. పెరుగుతున్న నిత్యావసర ధరల దృష్ట్యా ప్రస్తుతం ఇస్తున్న పారితోషికం ఏమాత్రం సరిపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పెద్దలు తమ మొండివైఖరి వీడి చర్చలకు ఆహ్వానించాలని వారు విజ్ఞప్తి చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో గర్భిణీలకు సేవలందించడం నుంచి చిన్నపిల్లలకు టీకాలు వేయించడం వరకు ఆశాల సేవలు వెలకట్టలేనివి. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలకు తెగించి విధులు నిర్వహించిన చరిత్ర తమదని వారు పేర్కొన్నారు. ఇంతటి కష్టానికి తగిన ప్రతిఫలం దక్కకపోవడం శోచనీయమని కార్యకర్తలు వాపోయారు. కేవలం ఎన్నికల స్టంట్లుగా హామీలను వదిలేయకుండా ఆచరణలో చూపాలని కోరారు. తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించకపోయినా కనీస వేతనం కల్పించడం కనీస ధర్మమని వారు భావిస్తున్నారు. ఈ పోరాటం తమ హక్కుల కోసమేనని వారు స్పష్టం చేశారు. అసెంబ్లీ పరిసరాల్లో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేసినప్పటికీ కొందరు కార్యకర్తలు చాకచక్యంగా సభ ప్రాంగణం సమీపానికి చేరుకున్నారు. అక్కడ నినాదాలు చేస్తూ ప్రభుత్వ దృష్టిని ఆకర్షించే ప్రయత్నం చేశారు. అప్రమత్తమైన పోలీసులు వారిని వెంటనే అదుపులోకి తీసుకున్నారు. మహిళా పోలీసుల సహాయంతో వారిని అక్కడి నుంచి తరలించారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న వేళ తమ గళం వినిపించాలని పట్టుదలతో కార్యకర్తలు ప్రయత్నించారు. నిరసన గొంతును అణచివేసే చర్యలను విపక్షాలు సైతం తీవ్రంగా ఖండించాయి. కార్మిక వర్గాల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించాయి. ఆశా కార్యకర్తల డిమాండ్ల పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే రాబోయే రోజుల్లో పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. జిల్లా కేంద్రాల్లో నిరసనలు కొనసాగిస్తూనే రాష్ట్ర రాజధానిని ముట్టడిస్తామని చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలకు ఆటంకం కలగకూడదనే ఉద్దేశంతో ఇప్పటివరకు సంయమనం పాటించామని తెలిపారు. తమ సహనాన్ని పరీక్షించవద్దని వారు పాలకులను కోరారు. న్యాయమైన వేతనం పొందే వరకు వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని సంఘాల నేతలు ప్రకటించారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ఐక్యంగా ఉండి పోరాడుతామని ప్రతిజ్ఞ చేశారు. పోలీసులు ప్రయోగించిన లాఠీలకు తాము భయపడేది లేదని ఆశా వర్కర్లు స్పష్టం చేశారు. గాయపడిన తోటి కార్యకర్తలను చూసి వారిలో ఆవేశం కట్టలు తెంచుకుంది. గాయాలకు చికిత్స చేయించుకుంటూనే వారు నిరసన గళాన్ని వినిపించారు. తమ కుటుంబాల భవిష్యత్తు కోసం చేస్తున్న ఈ పోరాటంలో వెనకడుగు వేయబోమని తెగేసి చెప్పారు. చట్టసభల్లో ఉన్న నాయకులు తమ సమస్యలపై చర్చించాలని వారు విన్నవించారు. క్షేత్రస్థాయిలో ప్రజారోగ్యాన్ని కాపాడుతున్న తమకు గుర్తింపు లేకపోవడం అన్యాయమని వారు భావిస్తున్నారు. ప్రభుత్వ నిర్బంధం పెరిగే కొద్దీ తమ ఉద్యమం మరింత బలపడుతుందని వారు విశ్వాసం వ్యక్తం చేశారు.

# డ్రైనేజీ వ్యవస్థ లేక కాలనీ ప్రజలు సతమతం.!

**హర్షం వ్యక్తం చేసిన కాలనీవాసులు**

**బోడుప్పల్, విశాలభారతి:**



ఘట్కేసర్ సర్కిల్ అన్నోజిగూడ లో గల డాక్టర్ ప్రకాష్ రావు నగర్ 10వ వార్డు వెల్ఫేర్ అసోసియేషన్ లో డ్రైనేజీ అవుట్ లెట్లు లేక కాలనీ వాసులు నానా తిప్పలు పడుతున్నారు. కాలనీ మాజీ కౌన్సిలర్ బాలగోని వెంకటేష్ గౌడ్ కు కాలనీ అధ్యక్ష, కార్యదర్శులు విన్నవించుకోగా కాలనీ లోని పలు సమస్యల పరిష్కార దిశగా శనివారం రోజు ఉదయం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రెష్ యాదవ్ ని మాజీ కౌన్సిలర్ బాలగోని వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో కాలనీవాసులతో పెద్ద సంఖ్యలో ఆయన స్వగృహం బోడుప్పల్లో మర్యాదపూర్వకంగా కలిసి కాలనీలోని డ్రైనేజీ వ్యవస్థ తో పాటు సిసి రోడ్ల నిర్మాణం, ఇంటింటికి మంచినీటి నల్ల కలెక్షన్లు, కాలనీ కమ్యూనిటీ హాల్, పిల్లలకు, పెద్దలకు వెసులుబాటుగా పార్క్ పలు సమస్యలను విన్నవించడం జరిగింది. తోటకూర వజ్రెష్ యాదవ్ సానుకూలంగా స్పందించి త్వరలో మీ కాలనీ లోని సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బాలగోని వెంకటేష్ గౌడ్, ప్రెసిడెంట్ కె.సూర్యకాంత్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ సురేందర్ రావు. జనరల్ సెక్రెటరీ సొల్లేటి రఘు, ఊట్కమూరి వెంకటేష్, జాయింట్ సెక్రెటరీ పి. తిరుమలయ్య, ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఏ. అభిషేక్, ఎం. ఆనంద్ బాబు, పి. ఆనంద్ కుమార్, ట్రెజరర్ సిహెచ్. వెంకటేశ్వర్లు, అడ్వైజర్ చలపతిరావు, సిహెచ్. ప్రసాద్, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ పి. శేఖర్ బాబు, ఎం. రాజు రెడ్డి, కాలనీ సభ్యులు జగన్, మనిధర్, ప్రశాంత్ కుమార్, రాజు, గడ్డం రాజు, ముత్యాలు, సమ్మయ్య, శోభన్ బాబు, ఎల్లయ్య తదితరులు కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మూసీ ప్రాజెక్టు పేరిట భారీ అవినీతి

- మూసీ పేరుతో రూ.1.5 లక్షల కోట్ల స్కామ్‌కు ప్రభుత్వం ప్లాన్
- గ్యారెంటీలకు లేని డబ్బు, మూసీకి ఎక్కడి నుంచి వస్తుందని ప్రశ్న
- కమీషన్ల కోసమే ప్రాజెక్టు వ్యయాన్ని భారీగా పెంచారని ఆరోపణ
- సుందరీకరణ నెపంతో పేదల గూడు చెడగొడితే ఊరుకోమని హెచ్చరిక
- విలువైన భూములను బడా బాబులకు కట్టబెట్టే ప్రయత్నం
- బాధితుల పక్షాన నిలబడి ప్రభుత్వంపై యుద్ధం చేస్తామని స్పష్టం



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాష్ట్రంలో అధికార పక్షం అనుసరిస్తున్న తీరుపై బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కల్వకుంట్ల తారక రామారావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన గ్రేటర్ హైదరాబాద్ బీఆర్ఎస్వీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని సర్కారు ప్రజా సమస్యలను పక్కనపెట్టి కేవలం రాజకీయ కక్షసాధింపు చర్యలకే ప్రాధాన్యత ఇస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వం చేస్తున్న తప్పులను, అవినీతి అక్రమాలను ప్రశ్నిస్తే బెదిరింపులకు పాల్పడటం రేవంత్ రెడ్డికి అలవాటుగా మారిందని ధ్వజమెత్తారు. ఎన్ని బెదిరింపులకు దిగినా ప్రజా పక్షాన పోరాడే బీఆర్ఎస్ వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. శాసనసభలో సైతం ప్రతిపక్ష గొంతు నొక్కే ప్రయత్నం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

నేడు అసెంబ్లీ వేదికగా మైనింగ్ అక్రమాలపై చర్చ జరుగుతున్న సమయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వ్యవహరించిన తీరును కేటీఆర్ తప్పుబట్టారు. వాస్తవాలను వెలికితీసే క్రమంలో ప్రతిపక్ష సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక బెదిరింపు ధోరణిని ప్రదర్శించడం ప్రజాస్వామ్యానికి విఘాతమని పేర్కొన్నారు. అధికార గర్వంతో విపక్షాలను భయపెట్టాలని చూడటం రేవంత్ రెడ్డి సర్కారు నైజమని విమర్శించారు. ఉద్యమ కాలం నుంచి ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని నిలబడిన తమ పార్టీకి ఇటువంటి బెదిరింపులు కొత్తేమీ కాదని గుర్తుచేశారు. ప్రజల పక్షాన నిలబడి నిలదీస్తుంటే తట్టుకోలేక వ్యక్తిగత దూషణలకు, బెదిరింపులకు దిగడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని వ్యాఖ్యానించారు. పాలనపై పట్టు సాధించకుండా కేవలం విపక్షాలను ఇబ్బంది పెట్టడమే లక్ష్యంగా పెట్టుకున్నారని ఆరోపించారు. మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు పేరుతో రాష్ట్రంలో భారీ కుంభకోణానికి ప్రభుత్వం స్కెచ్ వేసిందని కేటీఆర్ ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుకు నిధులు లేవని సాకులు చెబుతున్న ముఖ్యమంత్రి, మూసీ ప్రక్షాళన కోసం రూ.లక్షన్నర కోట్లు ఎక్కడి నుంచి తెస్తారని ప్రశ్నించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం రూ.16 వేల కోట్లతో మూసీ సుందరీకరణకు అత్యంత శాస్త్రీయమైన సమగ్ర ప్రణాళికను సిద్ధం చేసిందని గుర్తుచేశారు. ఆ ప్రణాళికను బుట్టదాఖలు చేసి అంచనాలను అమాంతం పెంచి వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దోచుకోవడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ప్రాజెక్టు వ్యయాన్ని భారీగా చూపడం వెనుక ఉన్న మర్మమేమిటో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అవినీతి సొమ్ము కోసమే ఇటువంటి అనవసరపు అంచనాలు రూపొందిస్తున్నారని ధ్వజమెత్తారు.

గత ప్రభుత్వ హయాంలోనే మూసీ నది ప్రక్షాళనలో భాగంగా మురుగునీటి శుద్ధి కేంద్రాల నిర్మాణాన్ని దాదాపుగా పూర్తి చేశామని కేటీఆర్ వెల్లడించారు. నగరంలోని మురుగునీరు మూసీలోకి చేరకుండా అడ్డుకట్ట వేసేందుకు పకడ్బందీ చర్యలు తీసుకున్నామని వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను మూసీలోకి పంపించి నదిని నిరంతరం ప్రవహించేలా చేసే ప్రణాళిక కూడా తమ ప్రభుత్వం సిద్ధం చేసిందని తెలిపారు. ఇప్పటికే క్షేత్ర స్థాయిలో పనులు జరుగుతుంటే వాటిని విస్మరించి కొత్తగా లక్షన్నర కోట్లు ఖర్చు చేస్తామనడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. ప్రజల అవసరాల కంటే సొంత ప్రయోజనాలకే రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఆరోపించారు. అంచనాల పెంపు వెనుక ఉన్న అసలు రహస్యం ఏమిటో బయటపెట్టాలని ఆయన కోరారు.

మూసీ ప్రాజెక్టు ముసుగులో పేదల ఇళ్లను కూల్చివేయాలని చూడటం అత్యంత దుర్మార్గమని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నదీ పరివాహక ప్రాంతంలో దశాబ్దాలుగా నివసిస్తున్న సామాన్యులను రోడ్డున పడేసే అధికారం ప్రభుత్వానికి ఎవరిచ్చారని ప్రశ్నించారు. దాదాపు మూడు వేల ఎకరాల విలువైన భూమిని సేకరించి కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. పేదల గూడును చెడగొట్టి అక్కడ విలాసవంతమైన హోటళ్లు, వ్యాపార సముదాయాలు నిర్మించాలని చూడటం ప్రభుత్వ ద్వంద్వ వైఖరికి అద్దం పడుతోందని విమర్శించారు. సామాన్యుల ఇళ్లు ఉంటే చట్టవిరుద్ధమని చెప్పే ప్రభుత్వం, అవే స్థలాల్లో బహుళ అంతస్తుల భవనాలు కట్టాలనుకోవడం ఏ రకమైన న్యాయమని నిలదీశారు. పేదలకు అన్యాయం జరిగితే బీఆర్ఎస్ ఊరుకోదని హెచ్చరించారు. హైదరాబాద్ నగర అభివృద్ధిని రేవంత్ రెడ్డి ప్రభుత్వం కుంటుపరుస్తోందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. గత పదేళ్లలో విశ్వనగరంగా ఎదుగుతున్న హైదరాబాద్ ప్రతిష్టను ఈ ప్రభుత్వం తన నిర్ణయాలతో దిగజారుస్తోందని విమర్శించారు. మూసీ బాధితుల పక్షాన తాము నిలబడతామని, వారి ఇళ్లను కూల్చివేస్తుంటే చూస్తూ ఊరుకోమని స్పష్టం చేశారు. భూసేకరణ పేరుతో రియల్ ఎస్టేట్ మాఫియాకు ప్రభుత్వం సహకరిస్తోందని ఆరోపించారు. ప్రాజెక్టుల పేరుతో ప్రజాధనాన్ని కాంట్రాక్టర్లకు దోచిపెడుతూ రాష్ట్ర ఖజానాను ఖాళీ చేస్తున్నారని మండిపడ్డారు. భవిష్యత్తులో ఈ అవినీతిపై పూర్తిస్థాయిలో విచారణ ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ప్రభుత్వం తన మొండివైఖరిని వీడకపోతే ప్రజలే బుద్ధి చెబుతారని కేటీఆర్ వ్యాఖ్యానించారు. తెలంగాణ సమాజం రేవంత్ రెడ్డి మార్కు పాలనను గమనిస్తోందని కేటీఆర్ పేర్కొన్నారు. హామీల అమలులో వైఫల్యం చెందడమే కాకుండా కొత్త సమస్యలను సృష్టిస్తూ కాలక్షేపం చేస్తున్నారని విమర్శించారు. మూసీ ప్రక్షాళన అవసరమే కానీ అది పేదల పొట్టకొట్టి చేయాల్సిన పని కాదని హితవు పలికారు. భారీ వ్యయంతో కూడిన ప్రాజెక్టుల ద్వారా కమిషన్లు దండుకోవాలనే తాపత్రయం తప్ప ప్రజల క్షేమం పట్టడం లేదని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో అసలు పాలన ఉందా అనే అనుమానం కలుగుతోందని ఎద్దేవా చేశారు. ప్రజాప్రతినిధులు బెదిరింపులకు దిగడం వల్ల సమస్యలు పరిష్కారం కావని గ్రహించాలని సూచించారు. ఇప్పటికైనా ప్రభుత్వం వాస్తవ పరిస్థితులను గుర్తించి అంచనాలను తగ్గించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో జరిగిన ఈ సమావేశంలో యువత, విద్యార్థి విభాగం నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వారందరినీ ఉద్దేశించి కేటీఆర్ మాట్లాడుతూ ప్రభుత్వం చేస్తున్న అన్యాయాలపై సోషల్ మీడియా వేదికగా పోరాడాలని పిలుపునిచ్చారు. అబద్ధపు ప్రచారాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో ఎండగట్టాలని కోరారు. ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి వీధి రౌడీలాగా మాట్లాడుతుంటే రాష్ట్ర గౌరవం దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వెల్లడించారు. ప్రతి కార్యకర్త బాధితులకు అండగా నిలవాలని దిశానిర్దేశం చేశారు. అధికార పక్షం ఎన్ని అడ్డంకులు సృష్టించినా ప్రజల గొంతుకగా నిలబడతామని కేటీఆర్ పునరుద్ఘాటించారు. మూసీ ప్రాజెక్టు అంచనాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. నిధుల సమీకరణ ఎలా చేస్తారో, ఎంత ఖర్చు అవుతుందో ప్రజలకు వివరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని గుర్తుచేశారు. గాలిలో లెక్కలు చెబుతూ ప్రజలను భ్రమల్లో ముంచడం రేవంత్ రెడ్డికి అలవాటుగా మారిందని విమర్శించారు. గత ప్రభుత్వ పనులను తమ ఖాతాలో వేసుకోవాలని చూడటం మానుకోవాలని సూచించారు. కాళేశ్వరం నీటిని మూసీకి మళ్లించే ప్రక్రియను తమ ప్రభుత్వం ఎప్పుడో ప్రారంభించిందని పేర్కొన్నారు. కేవలం తమపై విమర్శలు చేయడానికే ఈ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని దుయ్యబట్టారు. రాష్ట్ర అభివృద్ధిని పణంగా పెట్టి రాజకీయ లబ్ధి పొందాలనుకోవడం సరికాదని హితవు పలికారు. నిధుల దుర్వినియోగంపై పోరాటం ఆగదని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ శ్రేణులు ఐక్యంగా ఉండి ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. పార్టీ నాయకులపై పెడుతున్న అక్రమ కేసులకు భయపడేది లేదని ధీమా వ్యక్తం చేశారు. న్యాయస్థానాల ద్వారా పోరాడి నిజాలను నిలబెడతామని చెప్పారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కును కాలరాయడం ఎవరికీ సాధ్యం కాదని పేర్కొన్నారు. మూసీ నది సుందరీకరణ పేరుతో జరుగుతున్న వినాశనాన్ని అడ్డుకుంటామని భరోసా ఇచ్చారు. తమ హయాంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. అబద్ధాలను నిజం చేసే ప్రయత్నాలను తిప్పికొట్టాలని కోరారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కష్టపడాలని, ప్రజల గుండెల్లో బీఆర్ఎస్‌కు స్థానం ఎప్పుడూ ఉంటుందని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. చివరగా కేటీఆర్ మాట్లాడుతూ తెలంగాణ ఆత్మగౌరవాన్ని కాపాడటమే తమ లక్ష్యమని ప్రకటించారు. ఢిల్లీ గులాంల చేతిలో రాష్ట్రం చిక్కుకుపోయిందని, దీని నుంచి విముక్తి కలిగించాల్సిన బాధ్యత యువతపై ఉందని అన్నారు. రేవంత్ రెడ్డి పాలనలో ప్రతి వర్గం అసంతృప్తితో ఉందని విశ్లేషించారు. రైతుబంధు, దళితబంధు వంటి పథకాలను అటకెక్కించి కేవలం ప్రకటనలకే పరిమితమయ్యారని విమర్శించారు. మూసీ ప్రాజెక్టు విషయంలో ప్రభుత్వం వెనక్కి తగ్గకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. రాష్ట్ర శ్రేయస్సు కోసం ఎన్ని త్యాగాలకైనా సిద్ధమని స్పష్టం చేశారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, కానీ సిద్ధాంతం ముఖ్యం అని పేర్కొన్నారు. ప్రజా మద్దతుతో తిరిగి అధికారంలోకి వస్తామని కేటీఆర్ తన ప్రసంగాన్ని ముగించారు.

# కాళేశ్వరం అవినీతిపై రేవంత్ సైలెంట్

- కొత్త పార్టీ పెట్టే హక్కు ఎవరికైనా ఉందని కవిత నిర్ణయానికి మద్దతు
- కాళేశ్వరం ప్రాజెక్టు వైఫల్యానికి కేసీఆరే ప్రధాన కారణమని విమర్శ
- టోపీ పెట్టుకుని కేసీఆరే డిజైన్ చేయడం వల్లే వేల కోట్లు వృథా అని ఎద్దేవా
- సీఎం ఉపయోగిస్తున్న భాష తెలంగాణ సమాజం తలదించుకునేలా ఉంది
- ప్రధానిపై రేవంత్ స్థాయి దిగజారి మాట్లాడుతున్నారని ఆరోపణ
- కాళేశ్వరం అవినీతిపై చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం ఫెయిల్



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాజకీయ యవనికపై కొత్త సమీకరణాలు చోటుచేసుకుంటున్న తరుణంలో భారత రాష్ట్ర సమితి నాయకురాలు కల్వకుంట్ల కవిత నూతన రాజకీయ పార్టీ స్థాపన దిశగా అడుగులు వేయడం చర్చనీయాంశంగా మారింది. ఈ పరిణామంపై కేంద్ర సమాచార ప్రసార శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ స్పందిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజకీయ పార్టీని స్థాపించుకునే హక్కు ప్రతి పౌరుడికీ ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఇది పూర్తిగా వారి వ్యక్తిగత నిర్ణయమని, రాజకీయ స్వేచ్ఛకు సంబంధించిన అంశమని స్పష్టం చేశారు. రాష్ట్రంలో మారుతున్న రాజకీయ పరిస్థితులకు ఈ కొత్త పార్టీ ప్రతిపాదన ఒక సంకేతమని ఆయన పేర్కొన్నారు. కవిత తీసుకోబోయే ఈ నిర్ణయాన్ని తాము స్వాగతిస్తున్నామని, రాజకీయాల్లో పోటీ ఎప్పుడూ ఆరోగ్యకరంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. బీఆర్ఎస్ అగ్ర నాయకత్వంపై విమర్శలు ఎక్కుపెట్టిన బండి సంజయ్.. కాళేశ్వరం ఎత్తిపోతల పథకం వైఫల్యానికి మాజీ ముఖ్యమంత్రి కేసీఆరే సంపూర్ణ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఆ ప్రాజెక్టుకు కేసీఆర్ స్వయంగా ప్రధాన ఇంజనీర్‌గా వ్యవహరించారని ఆయన ఎద్దేవా చేశారు. టోపీ ధరించి మరీ క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేసిన కేసీఆర్.. ప్రాజెక్టు రూపకల్పనలో చేసిన తప్పిదాల వల్లే నేడు అన్నారం, మేడిగడ్డ వంటి బ్యారేజీలు కుంగిపోయాయని ఆరోపించారు. కేసీఆర్ తీసుకున్న అశాస్త్రీయ నిర్ణయాల వల్ల వేల కోట్ల రూపాయల ప్రజాధనం వృథా అయిందని మండిపడ్డారు. ఈ భారీ ప్రాజెక్టు వైఫల్యం వెనుక ఉన్న పాపమంతా గత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని ఆయన ఘాటుగా విమర్శించారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు విరుద్ధంగా సాగిన ఈ నిర్మాణం నేడు రాష్ట్రానికి గుదిబండగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉపయోగిస్తున్న భాషా తీరుపై బండి సంజయ్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. రాష్ట్ర అత్యున్నత పదవిలో ఉన్న వ్యక్తి మాట్లాడుతున్న మాటలు తెలంగాణ సమాజం తలదించుకునేలా ఉన్నాయని ఆక్షేపించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై విమర్శలు చేసే క్రమంలో రేవంత్ రెడ్డి తన స్థాయిని మరచి దిగజారి మాట్లాడుతున్నారని ఆరోపించారు. రాజకీయాల్లో విమర్శలు సహజమని, కానీ అవి హుందాగా ఉండాలని సూచించారు. దేశ ప్రధానిని ఉద్దేశించి అసభ్యకరమైన పదజాలాన్ని వాడటం రేవంత్ రెడ్డి అహంకారానికి నిదర్శనమని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో అభివృద్ధి కంటే బూతుల పురాణమే ఎక్కువగా వినిపిస్తోందని ఆయన విమర్శించారు. ముఖ్యమంత్రి తన ప్రవర్తనను మార్చుకోవాలని, లేదంటే ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

కాళేశ్వరం అవినీతిపై చర్యలు తీసుకోవడంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బండి సంజయ్ దుయ్యబట్టారు. ఎన్నికల ముందు బీఆర్ఎస్ నేతలను జైలుకు పంపిస్తామని ప్రగల్భాలు పలికిన రేవంత్ రెడ్డి.. అధికారంలోకి వచ్చాక ఆ విషయాన్ని గాలికి వదిలేశారని విమర్శించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల మధ్య అంతర్గత ఒప్పందం ఉందని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన భారీ కుంభకోణాలపై విచారణ జరిపించడంలో జాప్యం ఎందుకు జరుగుతోందని ప్రశ్నించారు. కేసీఆర్ కుటుంబం చేసిన తప్పులను కప్పిపుచ్చే ప్రయత్నం కాంగ్రెస్ చేస్తోందని ఆరోపించారు. రాష్ట్ర ఖజానాను కొల్లగొట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, లేదంటే ప్రజలకు సమాధానం చెప్పుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. తెలంగాణలో రాజకీయ శూన్యతను భర్తీ చేసేందుకు కవిత ప్రయత్నిస్తున్నారా అనే ప్రశ్నకు స్పందిస్తూ.. ఏ పార్టీ అయినా ప్రజల మద్దతు ఉంటేనే మనుగడ సాగిస్తుందని బండి సంజయ్ అన్నారు. కుటుంబ పాలనతో విసిగిపోయిన తెలంగాణ ప్రజలు ఇప్పటికే బీఆర్ఎస్‌ను పక్కన పెట్టారని గుర్తు చేశారు. ఇప్పుడు అదే కుటుంబం నుండి మరో కొత్త పార్టీ రావడం వల్ల పెద్దగా మార్పు ఉండదని ఆయన అభిప్రాయపడ్డారు. రాజకీయాల్లో ఎవరికైనా అవకాశం ఉంటుందని, కానీ విశ్వసనీయత అనేది చాలా ముఖ్యమని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి కట్టుబడి ఉందని, రాష్ట్రానికి రావాల్సిన నిధుల విషయంలో ఎప్పుడూ వివక్ష చూపలేదని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో ఘర్షణ వైఖరిని వీడి సహకరించాలని సూచించారు. కేసీఆర్ హయాంలో జరిగిన ప్రాజెక్టుల రీడిజైనింగ్ వెనుక భారీ అవినీతి దాగి ఉందని బండి సంజయ్ పునరుద్ఘాటించారు. కేవలం కమీషన్ల కోసమే ప్రాజెక్టుల అంచనా వ్యయాన్ని పెంచారని ఆరోపించారు. శాస్త్రవేత్తల మాట వినకుండా కేసీఆర్ తన సొంత తెలివితేటలతో ప్రాజెక్టులను నిర్మించడం వల్లే ఇవాళ రైతులకు నీరు అందడం లేదని మండిపడ్డారు. వేల కోట్లు ఖర్చు చేసినా ఒక్క ఎకరానికి కూడా కొత్తగా నీరు ఇవ్వలేదని విమర్శించారు. ఈ వైఫల్యాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. గత పదేళ్ల పాలనలో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని, దీనికి కేసీఆర్ కుటుంబమే కారణమని ధ్వజమెత్తారు. ప్రజల సొమ్ముతో విలాసవంతమైన భవనాలు నిర్మించుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం కూడా గత ప్రభుత్వ బాటలోనే నడుస్తోందని బండి సంజయ్ విమర్శించారు. హామీల అమలులో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. రుణమాఫీ, మహాలక్ష్మి వంటి పథకాలు క్షేత్రస్థాయిలో సక్రమంగా అమలు కావడం లేదని పేర్కొన్నారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకే ముఖ్యమంత్రి నిరంతరం రాజకీయ విమర్శలు చేస్తున్నారని అభిప్రాయపడ్డారు. పాలనపై దృష్టి పెట్టకుండా ప్రతిపక్షాలను తిట్టడమే పనిగా పెట్టుకున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ దెబ్బతిందని, గ్యాంగ్ వార్‌లు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సామాన్య ప్రజలకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణలో భారతీయ జనతా పార్టీ బలమైన శక్తిగా ఎదుగుతోందని బండి సంజయ్ ధీమా వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్రంలో మోదీ నాయకత్వంలో జరుగుతున్న అభివృద్ధి పనులే తమకు శ్రీరామరక్ష అని పేర్కొన్నారు. కవిత పెట్టబోయే కొత్త పార్టీ వల్ల బీజేపీకి ఎటువంటి నష్టం లేదని, తాము ఎప్పుడూ ప్రజల పక్షానే ఉంటామని స్పష్టం చేశారు. గ్రామగ్రామాన పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామని వివరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు ప్రత్యామ్నాయం కేవలం బీజేపీ మాత్రమేనని ఆయన నొక్కి చెప్పారు. కార్యకర్తలు ధైర్యంగా ఉండి ప్రజల సమస్యలపై పోరాడాలని పిలుపునిచ్చారు.

# కరెన్సీ నోట్లపై అంబేదర్ ఫోటో ముద్రించాలి



**ఆలేరు, విశాలభారతి:** అంబేద్కర్ ఫోటోని కరెన్సీ నోట్లపై ముద్రించాలనీ అంబేద్కర్ ఫోటో సాధనీ సమితి జిల్లా సభ్యులు కుడుదుల సత్యనారాయణ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు, ఈ సందర్భంగా మాట్లాడుతూ రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా స్ఫూర్తి ప్రదాత డా॥ బి ఆర్ అంబేదగర్ అని అన్నారు. 1921లో ఇంపిరియల్ బ్యాంకు కుప్పకూలినప్పుడు 1923 లో రూపాయి దాని సమస్య పరిష్కార మార్గం" అనే పుస్తకాన్ని వ్రాసి హిల్టాన్ యంగ్ కమీషన్, సైమన్ కమిషన్, రాయల్ కమిషన్ ఇవ్వడం వల్ల నాడు నేడు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ను ఎర్పాటు చేశారని ఆయన అన్నారు, బి ఆర్ అంబేద్కర్ లేకుంటే బ్యాంకింగ్ వ్యవస్థ ఉండేది కాదు, త్వరలో దీనిపై త్వరలో కేంద్ర ప్రభుత్వము కరెన్సీ నోట్లపై డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఫోటో ముద్రించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో బహుజన నాయకులు శ్రీకాంత్, పరశురాములు, బిక్షపతి, శంకర్, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# దళిత క్రైస్తవుల హక్కులపై సుప్రీంకోర్టు తీర్పు పునఃసమీక్షించాలి

- రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని కేవీపీఎస్ నేతల ఆందోళన
- దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా నిరాకరణపై వ్యతిరేకత
- ఆర్టికల్ 15, 25లకు విరుద్ధమని కేవీపీఎస్ అభిప్రాయం
- కేంద్రం వెంటనే రివ్యూ పిటిషన్ దాఖలు చేయాలని డిమాండ్



**సత్తుపల్లి, విశాలభారతి :** దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా ఉండదని వెలువడిన సుప్రీంకోర్టు తీర్పును పునఃసమీక్షించాలని కేవీపీఎస్ జిల్లా కమిటీ సభ్యుడు కొలికపోగు సర్వేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ తీర్పు రాజ్యాంగ స్ఫూర్తికి అనుకూలంగా లేదని, ముఖ్యంగా సమానత్వం మరియు మత స్వేచ్ఛకు భంగం కలిగిస్తుందని ఆయన వ్యాఖ్యానించారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 15 ప్రకారం మతం, కులం ఆధారంగా వివక్ష చూపరాదని, అలాగే ఆర్టికల్ 25 ప్రతి పౌరుడికి తనకు నచ్చిన మతాన్ని అనుసరించే హక్కు కల్పిస్తుందని ఆయన గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో మత మార్పిడి కారణంగా సామాజిక రక్షణలను తొలగించడం సరైన విధానం కాదని పేర్కొన్నారు.కులం ఒక సామాజిక సమస్యగా కొనసాగుతూనే ఉందని, మత మార్పిడి జరిగినా వివక్ష పూర్తిగా తొలగిపోలేదని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన కారంచేడు, చుండూరు ఘటనలను ఉదాహరణగా ప్రస్తావిస్తూ కుల ఆధారిత హింస ఇప్పటికీ కొనసాగుతోందని అన్నారు.ఈ తీర్పు వల్ల క్రైస్తవం, ఇస్లాం, బౌద్ధం వంటి మతాలను అనుసరించే అణగారిన వర్గాలకు తీవ్రమైన ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని, ముఖ్యంగా ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీస్ చట్టం కింద లభించే రక్షణలు కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.జస్టిస్ కె.జి. బాలకృష్ణన్ కమిటీ నివేదిక ఆలస్యమవడం పట్ల కూడా ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేసి, అణగారిన వర్గాల హక్కులను పరిరక్షించాలని డిమాండ్ చేశారు.సమానత్వం, మత స్వేచ్ఛ, సామాజిక న్యాయం వంటి రాజ్యాంగ విలువలను కాపాడేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు.

## డ్రైనేజీ నిర్మాణ పనుల పర్యవేక్షణ మాజీ కార్పొరేటర్ శాంతి



**నాచారం, విశాలభారతి:** భవాని నగర్ లో జరుగుతున్న భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులు గత కొద్దిరోజులుగా వివిధ కారణాల వల్ల నిలిపివేయడం జరిగింది. మాజీ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ అధికారులతో కలిసి భవాని నగర్ లో పర్యటించి లెవెల్ సరిగ్గా లేనందున మురుగునీరు రివర్స్ వచ్చే అవకాశం ఉందని తెలియడంతో రోడ్ నెంబర్ మూడు లో సుమారు 100 మీటర్ల మేర వేసిన పైప్ లైన్ ను తొలగించి కొత్త లెవెల్ ప్రకారం వేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు మోహన్ రెడ్డి ప్రధాన కార్యదర్శి మధుసూదన్ రెడ్డి కృష్ణారెడ్డి కట్ట బుచ్చన్న గౌడ్ చంద్రశేఖర్ సాయి జెన్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# అసెంబ్లీలో మైనింగ్ ప్రకంపనలు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**







తెలంగాణ శాసనసభ వేదికగా మైనింగ్ వ్యవహారం అధికార, ప్రతిపక్షాల మధ్య తీవ్ర స్థాయి వాగ్వాదానికి దారితీసింది. మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు మైనింగ్ అక్రమాలపై చేసిన వ్యాఖ్యలు సభలో ప్రకంపనలు సృష్టించాయి. రక్షకుడే భక్షకుడిగా మారి కంచె చేను మేసిన చందంగా రాష్ట్రంలో అక్రమ మైనింగ్ సాగుతోందని ఆయన ధ్వజమెత్తారు. ముఖ్యంగా హైదరాబాద్ నగరం నడిబొడ్డున ఎటువంటి అనుమతులు లేకుండా క్రషర్లు నడుస్తున్నాయని ఆయన ఆరోపించారు. రాఘవ కన్స్ట్రక్షన్స్ నిర్వహిస్తున్న క్రషర్లకు అవసరమైన ఎనిమిది రకాల నిబంధనలు పాటించడం లేదని ఆయన సభ దృష్టికి తెచ్చారు. రాష్ట్ర ఖజానాకు కోట్ల రూపాయల గండి పడుతున్నా ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉంటోందని హరీశ్ రావు ప్రశ్నించారు. మైనింగ్ శాఖ ఇప్పటికే సదరు సంస్థకు షోకాజ్ నోటీసులు, డిమాండ్ నోటీసులు జారీ చేసినా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం వెనుక మతలబు ఏంటని ఆయన నిలదీశారు. కాలుష్య నియంత్రణ మండలికి మైనింగ్ అధికారులు లేఖ రాసినా ఫలితం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఒక ప్రైవేట్ కంపెనీ అక్రమాలకు పాల్పడుతుంటే వ్యవస్థలు ఎందుకు నిర్వీర్యం అవుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పెద్దల అండదండలు ఉన్నాయనే అనుమానాన్ని ఆయన వ్యక్తం చేశారు.

ఈ అంశంపై తాను చేసిన సామాజిక మాధ్యమ పోస్టుకు మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పందించారని హరీశ్ రావు గుర్తుచేశారు. విచారణ జరిపిస్తామని మంత్రి చెప్పడం హర్షణీయమే అయినా, ఆయన పదవిలో ఉంటే పారదర్శకత సాధ్యం కాదని ఆయన వ్యాఖ్యానించారు. పొంగులేటి తనకు మంచి మిత్రుడే అని, తమ మధ్య ఎటువంటి వ్యక్తిగత విభేదాలు లేవని ఆయన స్పష్టం చేశారు. అయితే వ్యవస్థల గౌరవం కాపాడటం కోసం మంత్రి తన పదవికి రాజీనామా చేసిన తర్వాతే విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. గతంలో తాము చేసిన తప్పులను సాకుగా చూపి ఇప్పుడు అక్రమాలకు పాల్పడటం సరికాదని హితవు పలికారు. గతంలో ఓబుళాపురం మైనింగ్ అక్రమాలపై సభలో జరిగిన చర్చను హరీశ్ రావు ఉదహరించారు. అప్పట్లో ఆరోపణలు చేసిన నాగం జనార్ధన్ రెడ్డి నేతృత్వంలోనే హౌస్ కమిటీ వేశారని ఆయన గుర్తుచేశారు. ఒకవేళ ప్రభుత్వం తప్పు చేయలేదని భావిస్తే తక్షణమే హౌస్ కమిటీని ఏర్పాటు చేయాలని లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఆయన పట్టుబట్టారు. స్వచ్ఛమైన పాలన అందిస్తామని చెప్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఈ సవాల్‌ను స్వీకరించాలని ఆయన కోరారు. అక్రమాలను అడ్డుకోవడంలో చిత్తశుద్ధి ఉంటే వెనకడుగు వేయకూడదని ఆయన డిమాండ్ చేశారు. హరీశ్ రావు వ్యాఖ్యలపై మంత్రి శ్రీధర్ బాబు తీవ్రంగా స్పందించారు. మాజీ మంత్రి తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. విచారణకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నప్పుడు అనవసరంగా మంత్రుల పేర్లను ప్రస్తావించడం రాజకీయ కక్ష సాధింపు చర్యే అవుతుందని ఆయన మండిపడ్డారు. ఒక కంపెనీతో మంత్రికి ప్రత్యక్ష సంబంధం లేనప్పుడు ఆయన రాజీనామా చేయాలనడం అర్థరహితమని ఆయన కొట్టిపారేశారు. హరీశ్ రావు చేస్తున్నవన్నీ అడ్డగోలు ఆరోపణలేనని, ఆ వ్యాఖ్యలను సభ రికార్డుల నుంచి తొలగించాలని ఆయన స్పీకర్‌ను కోరారు.

మరో మంత్రి సీతక్క కూడా ప్రతిపక్షంపై విరుచుకుపడ్డారు. హరీశ్ రావు అసలు ఉద్దేశం కేవలం మంత్రి పొంగులేటిని లక్ష్యంగా చేసుకోవడమేనని ఆమె ఆరోపించారు. గత పదేళ్ల కేసీఆర్ పాలనలో నిబంధనలకు విరుద్ధంగా 40 క్రషర్లకు అనుమతులు ఇచ్చారని ఆమె గుర్తుచేశారు. పదేళ్లుగా జరిగిన అక్రమ మైనింగ్‌పై పూర్తిస్థాయి విచారణ జరపాలని ఆమె డిమాండ్ చేశారు. కావాలని మంత్రుల ప్రతిష్టను దెబ్బతీయడానికి ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని ఆమె విమర్శించారు. పదేళ్ల అరాచక పాలనపై శ్వేతపత్రం విడుదల చేయాలని ఆమె కోరారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఇసుక దోపిడీ విచ్చలవిడిగా జరిగిందని ఆరోపించారు. తప్పు చేసిన వారు ఎంతటి వారైనా వదిలిపెట్టే ప్రసక్తి లేదని ఆయన స్పష్టం చేశారు. అయితే హరీశ్ రావు కోరినట్లు హౌస్ కమిటీ వేయడం సాధ్యం కాదని, ప్రభుత్వమే విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకుంటుందని వివరించారు. సాండ్ మాఫియా అప్పట్లో దళితులపై దాడులు చేసినప్పుడు హౌస్ కమిటీ ఎందుకు వేయలేదని ఆయన ప్రశ్నించారు. విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షిస్తామని ఆయన హామీ ఇచ్చారు. మంత్రి శ్రీధర్ బాబు మరోసారి జోక్యం చేసుకుంటూ సదరు క్రషర్ కంపెనీలో మంత్రి పొంగులేటి డైరెక్టర్ గానీ, చైర్మన్ గానీ కాదని స్పష్టం చేశారు. మంత్రుల కుటుంబ సభ్యులు వ్యాపారాలు చేసుకోవడం తప్పా అని ఆయన నిలదీశారు. ఒకవేళ ఆ కంపెనీ ఏదైనా ఉల్లంఘనలకు పాల్పడితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. వ్యక్తిగత దూషణలకు దిగడం హరీశ్ రావు హోదాకు తగదని ఆయన సూచించారు. చర్చను పక్కదారి పట్టించడానికి బీఆర్ఎస్ నేతలు ప్రయత్నిస్తున్నారని ఆయన విమర్శించారు. మంత్రుల విమర్శలపై హరీశ్ రావు సంచలన రీతిలో స్పందించారు. తాను చేసిన ఆరోపణల్లో ఒక్కటి తప్పని తేలినా ఉరిశిక్షకు సిద్ధమని ఆయన సవాల్ విసిరారు. వ్యాపారం చేయడం నేరం కాదని, కానీ లైసెన్స్ లేకుండా మైనింగ్ నిర్వహించడం ముమ్మాటికీ తప్పేనని ఆయన వాదించారు. క్రషర్లకు రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి అనుమతులు తప్పనిసరని ఆయన గుర్తుచేశారు. తన దగ్గర అన్ని ఆధారాలు ఉన్నాయని, అందుకే ధైర్యంగా విచారణ కోరుతున్నానని ఆయన వివరించారు. ప్రభుత్వానికి భయం లేకపోతే కమిటీ వేయడానికి ఎందుకు సంకోచిస్తున్నారని ఆయన ప్రశ్నించారు. సభలో గందరగోళం పెరుగుతున్న క్రమంలో ప్యానెల్ స్పీకర్ బాలు నాయక్ స్పందిస్తూ హరీశ్ రావును తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని కోరారు. కానీ హరీశ్ రావు తన డిమాండ్‌పై పట్టుబట్టడంతో స్పీకర్ ఆయన మైక్ కట్ చేశారు. అనంతరం బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌కు మాట్లాడే అవకాశం ఇచ్చారు. దీంతో ఆగ్రహించిన బీఆర్ఎస్ సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లి నినాదాలు చేశారు. మైనింగ్ అక్రమాలపై వెంటనే హౌస్ కమిటీ వేయాలని వారు పట్టుబట్టారు.

GENERAL news
WWW.VISHALABHARATI.COM
విశాల భారతి

# మూసీని అడ్డుకుంటే 'శివతాండవమే'..!

మొదటిపేజీ తరువాయి

భక్తులకు కనిపించేలా దీనిని అద్భుతంగా తీర్చి దిద్దనున్నారు. దీనితో పాటు మూసీ నది ప్రవాహం మధ్యలో సహజ సిద్ధంగా ఏర్పడిన ఒక దీవిపై వంద అడుగుల ఎత్తైన పరమశివుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నారు. నది గలగలల మధ్య కొలువుదీరనున్న ఈ భారీ శివలింగం ఆధ్యాత్మిక ప్రేమికులను విశేషంగా ఆకట్టుకోనుంది. నది చుట్టూ పచ్చదనాన్ని పెంపొందిస్తూ పర్యాటక రంగాన్ని కూడా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. శంకుస్థాపన అనంతరం జరిగిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉద్వేగభరితంగా ప్రసంగించారు. మూసీ నది ప్రక్షాళన అనేది కేవలం ఒక ప్రాజెక్టు మాత్రమే కాదని, అది ఒక పవిత్ర సంకల్పమని ఆయన పేర్కొన్నారు. ఈ బృహత్తర కార్యంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని, ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈశ్వరుడి ఆశీస్సులతోనే కలుషితమైన మూసీని స్వచ్ఛమైన నదిగా మారుస్తామని ముఖ్యమంత్రి ధీమా వ్యక్తం చేశారు. సంకల్పం బలంగా ఉంటే ఎలాంటి లక్ష్యాన్నైనా సాధించవచ్చని ఆయన చెప్పారు. ప్రాజెక్టు అమలులో ఎదురయ్యే అడ్డంకులపై ముఖ్యమంత్రి తీవ్రంగా స్పందించారు. ఎవరైనా రాజకీయ కారణాలతో లేదా స్వార్థంతో ఈ పునరుజ్జీవన పనులను అడ్డుకోవాలని చూస్తే రాష్ట్ర ప్రభుత్వం ఉపేక్షించబోదని హెచ్చరించారు. అడ్డంకులు సృష్టించే వారిపై ప్రభుత్వం 'శివతాండవం' చేస్తుందంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు సభలో చర్చనీయాంశమయ్యాయి. అభివృద్ధి పనుల్లో రాజీ పడే ప్రసక్తే లేదని, ప్రజల భవిష్యత్తు కోసం ఎన్ని కఠిన నిర్ణయాలైనా తీసుకుంటామని స్పష్టం చేశారు. నది పరివాహక ప్రాంతంలోని అక్రమ కట్టడాల విషయంలో




కఠినంగా వ్యవహరిస్తామని సంకేతాలిచ్చారు. మూసీ ప్రక్షాళనలో భాగంగా కేవలం ఆలయాలే కాకుండా సర్వమత సామరస్యానికి ప్రతీకగా ఇతర ప్రార్థనా మందిరాలను కూడా నిర్మిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. నది ఒడ్డున మసీదు, చర్చి, గురుద్వారాలను ఏర్పాటు చేసి దీనిని ఒక గొప్ప పర్యాటక క్షేత్రంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. విదేశాల్లోని రివర్‌ఫ్రంట్ ల తరహాలో మూసీ తీరాన్ని అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. దీనివల్ల నగరంలో కాలుష్యం తగ్గడమే కాకుండా వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని వివరించారు. నదిలో ఎప్పుడూ నీరు కళకళలాడేలా చేసేందుకు శాశ్వత పరిష్కారాన్ని ప్రభుత్వం ఆలోచించింది. గోదావరి నది నుంచి సుమారు 20 టీఎంసీల నీటిని హైదరాబాద్‌కు తరలించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. కొండపోచమ్మ సాగర్ నుంచి నీటిని మళ్లించి మూసీలో నిరంతరం నీటి ప్రవాహం ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. దీనివల్ల నది లోని దుర్వాసన పోవడమే కాకుండా భూగర్భ జలమట్టం పెరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. కేవలం వర్షాకాలంలోనే కాకుండా ఏడాది పొడవునా మూసీ పరవళ్లు తొక్కేలా చేయడం ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశ్యం. పర్యావరణం గురించి మాట్లాడుతూ మానవ తప్పిదాల వల్ల నదులు నాశనమవుతున్నాయని ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. కాలుష్యం ఇలాగే కొనసాగితే భావితరాలకు స్వచ్ఛమైన గాలి, నీరు దొరకడం కష్టమవుతుందని హెచ్చరించారు. మన తప్పుల వల్ల వచ్చే తరాలు నష్టపోకూడదని, అందుకే ఈ ప్రక్షాళన అత్యవసరమని అన్నారు. మూసీకి పూర్వవైభవం తీసుకురావడమే తమ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని వివరించారు. నదిలోకి మురుగునీరు చేరకుండా భారీ ఎస్టీపీ (మురుగునీటి శుద్ధి ప్లాంట్లు)లను నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఎన్ని కష్టాలు ఎదురైనా 'ఆరునూరైనా' ఈ మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టును పూర్తి చేసి తీరుతామని ముఖ్యమంత్రి శపథం చేశారు. ఇది ఒక రాజకీయ క్రీడ కాదని, నగర ప్రజల జీవన ప్రమాణాలను పెంచే ప్రయత్నమని చెప్పారు. ప్రభుత్వం కేటాయించిన రూ.700 కోట్లు ప్రాథమిక వ్యయం మాత్రమేనని, అవసరమైతే మరిన్ని నిధులు కేటాయిస్తామని వెల్లడించారు. పనుల వేగవంతానికి ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అధికారులు, ఇంజనీర్లు రేయింబవళ్లు కష్టపడి ఈ స్వప్నాన్ని సాకారం చేయాలని ఆదేశించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ ఈ ప్రాజెక్టు వల్ల నగర ముఖచిత్రం పూర్తిగా మారిపోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మంచిరేవుల ప్రాంతం త్వరలోనే ఒక ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతుందని చెప్పారు. ఆలయ నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తామని, నాణ్యతలో ఎక్కడా రాజీ పడబోమని స్పష్టం చేశారు. స్థానిక ప్రజల సహకారంతో ఈ చారిత్రక కట్టడాన్ని సకాలంలో పూర్తి చేస్తామని అన్నారు. సభకు హాజరైన భక్తులు, ప్రజలు ముఖ్యమంత్రి ప్రకటనలకు హర్షధ్వానాలతో స్వాగతం పలికారు. ఈ ప్రాజెక్టు కేవలం నిర్మాణాలకే పరిమితం కాకుండా నగర పర్యావరణానికి ప్రాణవాయువులా మారుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ఓంకారేశ్వర ఆలయం, వంద అడుగుల శివుడి విగ్రహం హైదరాబాద్‌కు కొత్త ల్యాండ్ మార్క్‌లుగా నిలవనున్నాయి. మూసీ ప్రక్షాళనతో ఒకప్పటి చారిత్రక వైభవం మళ్లీ కళ్లముందు సాక్షాత్కరిస్తుందని ఆశించవచ్చు. ఈ భారీ కార్యక్రమం విజయవంతమైతే దేశంలోనే ఒక నది పునరుజ్జీవనానికి ఇది గొప్ప ఉదాహరణగా మిగులుతుంది. వచ్చే కొన్ని ఏళ్లలో మూసీ తీరం కొత్త శోభను సంతరించుకోవడం ఖాయంగా కనిపిస్తోంది.

## మోటకొండూరులో బడిబాట నిర్వహించిన ఉపాధ్యాయులు



**మోటకొండూరు, విశాలభారతి:** ప్రొ.జయశంకర్ బడి బాట కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో ఉపాధ్యాయులు బడి బాట కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల చేర్పును పెంచేందుకు తల్లిదండ్రులను ఇంటింటికి వెళ్లి కలిశారు. పిల్లలను తప్పకుండా పాఠశాలకు పంపించాలని, విద్య ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు కేతిరెడ్డి రఘురామ్ రెడ్డి, ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు కలకోట రాజగోపాల్ రమాదేవి, గండ మల్ల విశ్వరూపం, కటుకూరి రమేష్ పాల్గొన్నారు.

## 'బిర్లా ఐలయ్య' చిత్రపటానికి ఘనంగా పాలాభిషేకం

- రైతులకు సాగునీరు అందించినందుకు కృతజ్ఞతలు
- మున్సిపల్ చైర్‌పర్సన్ బీజన బాలమణి భాస్కర్



**ఆలేరు, విశాలభారతి:** ఆలేరు నియోజకవర్గానికి సాగునీరు అందించి రైతుల కళ్లల్లో ఆనందం నింపిన ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు కృతజ్ఞతగా ఆయన చిత్రపటానికి ఆలేరు మున్సిపల్ చైర్‌పర్సన్ బీజన బాలమణి భాస్కర్ ఆధ్వర్యంలో శుక్రవారం పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గత 30 సంవత్సరాలుగా సాగునీరు లేక ఇబ్బందులు పడుతున్న రైతులకు ఎమ్మెల్యే ఐలయ్య ప్రత్యేక చొరవతో గత సంవత్సరం, ఈ సంవత్సరం వాగు ద్వారా సాగునీరు అందేలా చర్యలు తీసుకున్నారని తెలిపారు. వ్యవసాయానికి సరిపడా నీటిని అందించడంలో ముందుండి కృషి చేసినందుకు ఆయనను "అపర భగీరథుడు"గా అభివర్ణించారు. రైతుల కండల్లో సంతోషం వెల్లివిరియడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఇందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టౌన్ అధ్యక్షుడు ఎజాస్, ఓబీసీ రాష్ట్ర మెంబర్ ఎగ్గిడి శ్రీశైలం, మున్సిపల్ వైస్ చైర్మన్ అంగిడి ఆంజనేయులు, పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ ముదిగొండ శ్రీకాంత్, జైనుద్దీన్, ఎమ్మెస్ విజయకుమార్, సాగర్ రెడ్డి, దూసరి మురళి, పోరెల సతీష్, ఆలేటి అనిల్, కౌన్సిలర్లు వానరాశి మరియమ్మ మార్క్, మల్లెల సరిత శ్రీకాంత్, పస్తం ఆంజనేయులు, జూకంటి సంపత్, నీరజ, ఎండి సలీం, రాజశేఖర్, మల్లేష్, శివ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వీర హనుమాన్ విజయ యాత్ర పోస్టర్ ఆవిష్కరణ



**ఆలేరు, విశాలభారతి:** ఆలేరు మండల కేంద్రంలో బజరంగ్ దళ్ ఆలేరు శాఖ ఆధ్వర్యంలో వీర హనుమాన్ విజయ యాత్ర పోస్టర్‌ను శనివారం ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సమక్షంలో పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, విశ్వహిందూ పరిషత్-బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 2 సాయంత్రం ఆలేరు మార్కండేయ దేవాలయం సిల్క్ నగర్ నుండి దుర్గామాత దేవాలయం వరకు హనుమాన్ విజయ యాత్రను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. హనుమంతుని భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని విజయోత్సవ ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజాన భాస్కర్, బజరంగ్ దళ్ ఆలేరు కన్వీనర్ శ్రావణ్, మైదం భాస్కర్, వడ్డేమాన్ శ్రీకాంత్, వైకుంఠం, శ్రీధర్, అనిల్, శ్రీకాంత్, సురేష్, శివాజీ, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఈసీసీఈ డే నిర్వహణ




**దేవరుప్పుల, విశాలభారతి:** మండలం సింగరాజు పల్లి గ్రామ పంచాయతీలో (ఈసీసీఈ) ఇయర్లీ చైల్డ్‌హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా గ్రామ సర్పంచ్‌తో అంగన్వాడి ఉపాధ్యాయులు ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమంలో చిన్నారుల ప్రారంభ విద్యకు సంబంధించిన ప్రీ స్కూల్ సిలబస్ వివరంగా పరిచయం చేశారు. పిల్లల మానసిక, శారీరక, సామాసిక, అభివృద్ధికి ఈసీసీఈ విద్య ఎంతో కీలకమని, ఈ సందర్భంగా వివరించారు. చిన్న వయసులోనే సరైన విద్యా పద్ధతులు అలవాట్లు అలవర్చుకోవడం ద్వారా భవిష్యత్తులో మంచి పౌరులుగా ఎదగవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ కొండ ఊర్మిల మల్లారెడ్డి మాట్లాడుతూ, గ్రామంలోని ప్రతి చిన్నారికి నాణ్యమైన ప్రాథమిక విద్య అందించడం తన ముఖ్యమని, అంగన్వాడీ కేంద్రాల ద్వారా పిల్లల అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని, తెలిపారు. ఉపసర్పంచ్ మరియు వార్డు సభ్యులు కూడా పిల్లల భవిష్యత్తు కోసం ఇలాంటి కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యకమం సానుకూల వాతావరణంలో ఆనంద ఉత్సాహాలతో విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జోగు అనిల్, వార్డు సభ్యులు కొండ అఖిల్, మేకపోతుల నరసింహ, రాపాక యాదగిరి, అటికం స్రవంతికిరణ్, కొంగరి జ్యోతిరాములు, సిఏ మహేశ్వరి, అంగన్వాడి ఉపాధ్యాయులు కొము మంగ, చింతల శ్రీలత, మేకపోతుల రేణుక, మరియు గ్రామ ప్రజలు తల్లిదండ్రులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమం విజయవంతం చేశారు.

## టాలెంట్ టెస్ట్‌లో టాపర్గా నిలిచిన విద్యార్థి

- ప్రోత్సాహక బహుమతి 4 లక్షలు

**చౌటుప్పల్ విశాలభారతి:** తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ప్రతిభను ప్రోత్సహించేందుకు నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో బొమ్మిరెడ్డి హర్షిత రెడ్డి అద్భుత ప్రతిభ కనబరిచి టాపర్‌గా నిలిచింది. 202223 విద్యా సంవత్సరానికి చెందిన పదవ తరగతి బ్యాచ్‌కు నిర్వహించిన ఈ పరీక్షను రిలయన్స్ సంస్థ, ఎఫ్ ఎఫ్ ఈ సంస్థలు సంయుక్తంగా నిర్వహించాయి. ఈ టెస్ట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన హర్షిత రెడ్డి కి రిలయన్స్ సంస్థ నుంచి రూ.2,00,000, ఎఫ్ ఎఫ్ ఈ సంస్థ నుంచి రూ.2,00,000 మొత్తంగా రూ.4,00,000 ప్రోత్సాహక నగదు బహుమతిగా అందజేశారు. గురుకుల పాఠశాలల్లో చదువుతున్న పేద, ప్రతిభావంతులైన విద్యార్థులకు ఉన్నత విద్యాభ్యాసానికి ఈ సహాయం ఎంతో ఉపయోగపడుతుందని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తెలిపారు. ఇంత పెద్ద మొత్తంలో ఆర్థిక సహాయం అందించిన రిలయన్స్, ఎఫ్ ఎఫ్ ఈ సంస్థలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించి మరింత సహాయం అందించాలని కోరారు.

## వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి



**నిజామాబాద్, విశాలభారతి:** మండలంలోని మునిపల్లి గ్రామ శివారులో 63 నంబర్ జాతీయ రహదారి పై శనివారం గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై మహేష్ తెలిపారు. వివరాల్లోకి వెళితే మునిపల్లి గ్రామ శివారులో 63 జాతీయ రహదారి పైన శనివారం రోజు తెల్లవారుజామున 5: 30 గంటల సమయంలో ఆర్మూర్ నుండి నిజామాబాద్ వైపు వెళ్ళు మార్గంలో గుర్తు తెలియని మగ వ్యక్తికి గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలయ్యి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు సుమారుగా 50 నుండి 60 మధ్య వయస్సు కలిగి, శరీరంపైన తెల్లని మాసిన షర్ట్, నల్లని ప్యాంట్ కలదు. ఇట్టి విషయంలో కేసు నమోదు చేసుకుని మృతదేహన్ని ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి భద్రపర్చనైనది. మృతుని వివరాలు తెలిసిన వారు జక్రాన్ పల్లి పోలీస్ స్టేషన్ కు ఈ ఫోన్ నంబర్లకు 8712659853, 8712659742 సంప్రదించాలని ఎస్సై తెలిపారు.

## పాలిటెక్నిక్ కళాశాలలో అడ్మిషన్ల సంఖ్య పెంచాలి

**బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో**



**నిజామాబాద్, విశాలభారతి:** కొటగిరి మండలంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో అడ్మిషన్ల సంఖ్యను పెంచాలని సబ్ కలెక్టర్ వికాస్ మహతో అన్నారు శనివారం ఆయన పాలిటెక్నిక్ కళాశాలను పరిశీలించారు , కళాశాలలో మొత్తం విద్యార్థుల సంఖ్య 145గా ఉన్నట్లు పరిశీలించారు. అందులో మెకానికల్ శాఖలో 31 మంది, ఎలక్ట్రికల్ / ఎలక్ట్రానిక్స్ శాఖలో 114 మంది విద్యార్థులు ఉన్నారని కళాశాల సిబ్బంది తెలిపారు కళాశాలకు మొత్తం మంజూరు చేసిన సీట్ల సంఖ్య 360, అందులో మెకానికల్ మరియు ఎలక్ట్రికల్ శాఖలకు తలో 180 సీట్లు ఉన్నట్లు సబ్ కలెక్టర్ గుర్తించారు. ప్రవేశాల సంఖ్య గణనీయంగా తక్కువగా ఉన్నట్లు అడ్మిషన్ల సంఖ్య పెంచాలి అని సిబ్బందిని ఆదేశించారు ముఖ్యంగా మెకానికల్ ఇంజనీరింగ్ శాఖపై విద్యార్థుల్లో ఆసక్తి తగ్గడం ప్రధాన కారణం అని సిబ్బంది తెలిపారు కళాశాలలో మొత్తం సిబ్బంది సంఖ్య 15, ఇందులో లెక్చరర్లు మరియు హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్లు ఉన్నారు. ప్రవేశాల పెంపు కోసం అవగాహన కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తూ, పాంప్లెట్లు పంపిణీ చేయడం మరియు పాఠశాలల సందర్శనలు చేపట్టడం ద్వారా అడ్మిషన్లు ఆకర్షించాలని ఆదేశాలు జారీ చేశారు అయితే, ఈ చర్యలను మరింత విస్తృతంగా మరియు తీవ్రంగా అమలు చేయాల్సిన అవసరం ఉందని సూచించారు. తక్కువ ప్రవేశాలకు మరో ప్రధాన కారణంగా హాస్టల్ సౌకర్యం అమల్లో లేకపోవడం అని సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ సుధాకర్ సిబ్బంది పాల్గొన్నారు

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

**విశాలభారతి, నిజామాబాద్:** మండల కేంద్రానికి చెందిన సుమారు ఏడుగురికి , రెండు లక్షల 43 వేల రూపాయలు సీఎం రిలీఫ్ ఫండ్ నిధులు లబ్ధిదారులకు అందజేశారు. నట్ట భూమన్న కు 60000. రూపాయలు, భైరగోని రమేష్‌గౌడు కు 16000, చింతలపల్లి గంగు కు 14000, చిలుకూరి గంగారెడ్డి కి31500 , రీక్కల గంగ జమునకు 53500, షేక్ షరీఫా కు 42000, బాదావతు మంగ్యా కు 26000 పంపిణీ చేశారు. ఈసందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ,ఆర్ భూపతి రెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు .ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బండి పద్మ సత్యం , మాజీ సర్పంచ్ కట్ పల్లి నర్సారెడ్డి, జిల్లా యువజన విభాగం వైస్ ప్రెసిడెంట్ సొప్పరి వినోద్, వార్డ్ మెంబర్లు రుద్రాక్ష హేమంత్, కుంటోళ్ళ స్వర్ణలత, సంజీవ్, సోషల్ మీడియా అధ్యక్షులు నట్ట తిరుపతి, మండల మైనార్టీ సెల్ అధ్యక్షులు సైకిల్ టెక్ అక్బర్, బుయ్య చిన్న నరసయ్య ,మున్సబ్, గ్రామ ప్రజలు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు .

## పెద్ద వాగు చెక్ డ్యాం పనుల్లో నాణ్యత లోపాలు ఆపాలి



**మోటకొండూర్, విశాలభారతి:** సికిందర్ నగర్-మోటకొండూరు మధ్య పెద్ద వాగుపై నిర్మిస్తున్న చెక్ డ్యాం పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని సిపిఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి జహంగీర్ ఆందోళన వ్యక్తం చేశారు. సుమారు రూ.3 కోట్ల బడ్జెట్‌తో చేపట్టిన ఈ నిర్మాణ పనులను సిపిఎం పార్టీ బృందం ఈరోజు ప్రత్యక్షంగా పరిశీలించింది. పరిశీలన సందర్భంగా పనుల నాణ్యతపై పలు లోపాలు బృందం దృష్టికి వచ్చినట్లు తెలిపారు. చెక్ డ్యాం ఇరువైపులా నిర్మిస్తున్న కట్టలకు నాసిరకం మట్టిని వాడుతున్నారని, వరదల సమయంలో కట్ట కృంగిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. అలాగే నిర్మాణంలో నాసిరకమైన ఇసుక వాడుతున్నట్లు గమనించామని తెలిపారు. పనులు విడివిడిగా నిర్వహించడం వల్ల కూడా నాణ్యత లోపాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని అన్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులను ఫోన్ ద్వారా సంప్రదించి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరినట్లు చెప్పారు. ప్రజాధనం వృథా కాకుండా నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా అమలు చేసి చెక్ డ్యాం నిర్మాణ లోపాలను వెంటనే సరిదిద్దాలని అధికారులను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బొలగాని జయరాములు, మండల కార్యదర్శి కొల్లూరు ఆంజనేయులు, మండల కమిటీ సభ్యులు బందెల పోశయ్య తదితరులు పాల్గొన్నారు.

## పొరుగు రాష్ట్రాల వారిని వెంటనే తరలించండి

- బత్తుల వాణి విప్లవ్ గౌడ్ కౌన్సిలర్



**చౌటుప్పల్, విశాలభారతి:** పట్టణ కేంద్రంలోని పద్మశాలి కాలనీలో పరుగు రాష్ట్రాల వారి వలన ఆ కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని,వెంటనే వారిని ఖాళీ చేయించి కాలనీ వాసులకు న్యాయం చేయాలని చౌటుప్పల్ మున్సిపాలిటీ 13వ వార్డు కౌన్సిలర్ బత్తుల వాణి విప్లవ్ గౌడ్ చౌటుప్పల్ మున్సిపల్ కమిషనర్ జి. వెంకట్రాంరెడ్డి కి శనివారం మున్సిపల్ కార్యాలయంలో వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..చౌటుప్పల్ మున్సిపాలిటీ 13వ వార్డు పద్మశాలి కాలనీలో పలు ఇండస్ట్రీలలో పని చేసే పొరుగు రాష్ట్రాల వారు కిరాయి నివాసాలలో ఉంటున్నారు. వీరందరూ మాదకద్రవ్యాలకు అలవాటు పడి కాలనీలో నివసిస్తున్న ప్రజానీకానికి ఇబ్బందులు సృష్టిస్తున్నారు. వెంటనే వారు కిరాయి నివాసాలలో ఉన్న యజమానులకు పిలిపించి అట్టివారిని కాలనీ నుండి ఖాళీ చేయించాలని మున్సిపల్ కమిషనర్ కు వినతిపత్రం అందజేశామని తెలిపారు. మునుముందు వీరి వలన చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో ఎన్ని అవాంఛనీయ సంఘటనలు జరుగుతాయని వెంటనే వారిపై కూడా చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరడం జరిగింది.

## ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ విఫలం




- ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం నిండా మోసం చేసింది
- కాంగ్రెస్ నయ వంచక కాంగ్రెస్ పాలనను ప్రజాక్షేత్రంలో ప్రశ్నిస్తాం

**నిజామాబాద్, విశాలభారతి:**

వేల్పూర్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీ ల పేరుతో తెలంగాణ ప్రజలకు ఎన్నికల్లో హామీలు ఇచ్చి గడిచిన రెండు సంవత్సరాలుగా 6 గ్యారంటీ అమలుపరచకుండా తెలంగాణ నాలుగు కోట్ల ప్రజలను మోసం చేసిందని బాల్కొండ నియోజకవర్గం టిఆర్ఎస్ నాయకులు విమర్శించారు. అసెంబ్లీ లో ప్రవేశపెట్టిన బడ్జెట్లో 6 గ్యారంటీలో అమలు కోసం నిధులు కూడా కేటాయించకుండా ఇంకా కాంగ్రెస్ ప్రజలను మభ్యపెట్టాలని చూస్తుంది అని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అనేక అడ్డగోలు హామీలు ఇచ్చి ప్రజలను నమ్మించి ఓట్లు వేయించుకొని గద్దె నెక్కింది, అధికారం లోకి వచ్చిన 100 రోజుల్లోనే హామీలన్ని అమలు చేస్తాం అని ఎన్నికల్లో ప్రతి వేదికలో చెప్పారు. ప్రజలను నమ్మించడానికి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అనాదు గ్యారంటీ కార్డులను పంచి ప్రజలను మభ్యపెట్టింది. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 25 నెలలు కావస్తుంది కానీ ఏ ఒక్క హామీ కూడా సక్రమంగా అమలు చేయలేదు. పథకాల అమలు తక్కువ, ప్రచారం ఎక్కువ అన్న తీరున కాంగ్రెస్ పార్టీ పాలన సాగుతుంది. సమావేశంలో నాగంపేట్ శేఖర్ రెడ్డి, బద్దం ప్రవీణ్ రెడ్డి బాల్కొండ, కల్లెడ ఏలీయా, ప్రెసిడెంట్, దాసరి వెంకటేష్, రేగుంట దేవేందర్, జైడి నాగధర్, బద్దం రవి ,బద్దం నర్సారెడ్డి ,రేగుల్ల రాములు, దొంకంటి నర్సయ్య, చౌట్పల్లి రవి, శంకర్,ఆనంద్, యూసుఫ్, అశోక్ పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం



- వేసవి త్రాగునీటి ఎద్దడి పై ప్రత్యేక దృష్టి
- చౌటుప్పల్ మున్సిపాలిటీ వార్షిక బడ్జెట్ ప్రవేశం
- మోదుగాల పావని రమేష్ గౌడ్ మున్సిపల్ చైర్మన్

**చౌటుప్పల్,విశాలభారతి:**

మున్సిపల్ కార్యాలయంలో మునిసిపల్ చైర్ పర్సన్ మోదుగాల పావని రమేష్ గౌడ్ అధ్యక్షుడు నిర్వహించిన వార్షిక బడ్జెట్ సమావేశం విజయవంతంగా ముగిసింది. 2026_27 ఆర్థిక సంవత్సరానికి గాను వివిధ అభివృద్ధి పనుల కోసం రూ.54 కోట్ల 75 లక్షల బడ్జెట్ని ప్రవేశపెట్టిన కౌన్సిల్ ఆమోదం పొందింది. ఈ సందర్భంగా సమావేశంలో చర్చించిన కీలక అంశాలు తాగునీటి సమస్యల పరిష్కారం అమృత్ మిత్ర ప్రాజెక్టు కింద చేపట్టిన వాటర్ ట్యాంకుల నిర్మాణాలను యుద్ధ ప్రాతిపదిక న పూర్తి చేయాలని, తద్వారా పట్టణంలో ఉన్న నీటి కొరత తీర్చాలని కౌన్సిలర్లు చైర్ పర్సన్ దృష్టికి తీసుకెళ్లారు. స్వచ్ఛ భారత్ నిధులు స్వచ్ఛ భారత్ మిషన్ కింద కేటాయించిన బడ్జెట్ని ప్రజా మరుగుదొడ్ల నిర్మాణానికి మరియు పట్టణ పారిశుద్ధం మెరుగుదలకు వినియోగించాలని తీర్మానించారు. వేసవి కార్యచరణ రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కౌన్సిల్ నిర్ణయించింది. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ..ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో చౌటుప్పల్ అభివృద్ధికి కావలసిన అదనపు నిధులు మంజూరు చేయించుకుంటామని హామీ ఇచ్చారు. అందరూ కలిసికట్టుగా పనిచేసి వేసవి తాగునీటి ఇబ్బందులను అధిగమిస్తా మని పెండింగ్ లో ఉన్న ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తి చేస్తామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జి.వెంకట్ రామ్ రెడ్డి, వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్, కౌన్సిలర్లు సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ వరలక్ష్మి వారు బడ్జెట్ సంబంధించిన కాపీలను చదివి వినిపించడం జరిగింది. వీరితోపాటు ఏ ఈ సతీష్ కుమార్, మేనేజర్ శ్రీధర్ రెడ్డి, ఆర్. ఓ. అంజయ్య, సీనియర్ అసిస్టెంట్ రఘుపతి మరియు కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## ఓంకారేశ్వర ఆలయ పునర్నిర్మాణానికి శ్రీకారం

**రాజేంద్రనగర్, విశాలభారతి :**

రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని మంచిరేవులలో మూసీ నది తీరాన వెలసిన పురాతన ఓంకారేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణానికి నేడు భూమిపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క గారితో కలిసి ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ గారు పాల్గొన్నారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగిన ఈ శంకుస్థాపన కార్యక్రమం రాష్ట్ర ప్రజలందరికీ మేలు చేకూరాలని ఆకాంక్షించారు. మూసీ నది పునరుజ్జీవనం కేవలం పర్యావరణ పరిరక్షణ మాత్రమే కాకుండా మన సంస్కృతిని కాపాడుకునే ముఖ్యమైన అడుగు అని పేర్కొన్నారు. మూసీ తీరం మళ్లీ పూర్వ వైభవాన్ని సంతరించుకోవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజల పట్ల నిబద్ధత, సంకల్పం మరియు చిత్తశుద్ధితో కూడిన పాలన ద్వారా ప్రజా సంక్షేమమే లక్ష్యంగా



ముందుకు సాగుతున్నామని తెలిపారు. ప్రజలే దైవంగా భావించి, వారి ఆశయాల మేరకు సేవ చేయడం కొనసాగుతుందని పేర్కొన్నారు.

విశాల భారతి Real Talk
రియల్ టాక్
విశాల భారతి
www.vishalabharati.com
epaper.vishalabharati.com




## పుంజుకుంటున్న రిజిస్ట్రేషన్లు...

ప్రీమియం హౌసింగ్ వైపు కొనుగోలుదారుల మొగ్గు చూపుతున్నారు. 2026 ఫిబ్రవరి గణాంకాలు హైదరాబాద్ రియల్ మార్కెట్‌లో పాజిటివ్ సంకేతాలు ఇస్తున్నాయి. నైట్ ఫ్రాంక్ ఇండియా నివేదిక ప్రకారం, జనవరితో పోలిస్తే ఫిబ్రవరిలో రిజిస్ట్రేషన్లు 32% పెరిగి 6,179 యూనిట్లకు చేరాయి. మొత్తం లావాదేవీల విలువ రూ.4,139 కోట్లుగా నమోదైంది. ఈ గణాంకాల్లో ముఖ్యంగా గమనించాల్సిన అంశం ప్రీమియం సెగ్మెంట్ స్థిరత్వంగా కొనసాగుతున్నది. రూ.1 కోటి పైబడిన ఇళ్లకు డిమాండ్ తగ్గకుండా కొనసాగుతుండటం నగర ఆర్థిక స్థితిని ప్రతిబింబిస్తోంది. మొత్తం రిజిస్ట్రేషన్లలో 18% ఈ విభాగానికే చెందగా, రూ.50 లక్షల లోపు ఇళ్ల వాటా 64% గా ఉంది. మధ్య తరగతి విభాగానికి చెందిన రూ.50 లక్షల నుంచి 1 కోటి మధ్య ఇళ్ల విక్రయాలు కొంత మందగించడం గమనార్హం. 1,000 నుండి 2,000 చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన ఫ్లాట్లకు అధిక డిమాండ్ ఉంది. ఇది నగరంలో ఉద్యోగావకాశాలు, కుటుంబ పరిమాణం, జీవనశైలి మార్పులను ప్రతిబింబిస్తోంది.



## మౌలిక సదుపాయాలతో బూస్ట్ అప్...

రాష్ట్ర బడ్జెట్ 2026-27 హైదరాబాద్ నగర అభివృద్ధికి స్పష్టమైన దిశను నిర్దేశించింది. ముఖ్యంగా రవాణా, కనెక్టివిటీ ప్రాజెక్టులకు భారీగా నిధులు కేటాయించడం రియల్ ఎస్టేట్ రంగంపై ప్రత్యక్ష ప్రభావం చూపనుంది. మెట్రో రైల్ రెండో దశలో భాగంగా సుమారు రూ.19,579 కోట్లతో 86 కిలోమీటర్ల మేర కొత్త కారిడార్లను అభివృద్ధి చేయనున్నారు. నగరం నుంచి ఎయిర్‌పోర్ట్ వరకు, అలాగే మేడ్చల్, షామీర్‌పేట ప్రాంతాలను అనుసంధానించే ఈ ప్రాజెక్టు పూర్తయితే నగర పరిధి మరింత విస్తరించనుంది. ఈ ప్రభావంతో ఆ ప్రాంతాల్లో భూముల ధరలు కొత్త వెంచర్లతో రియల్ కార్యాకలాపాలు పెరిగే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఇదే సమయంలో రీజనల్ రింగ్ రోడ్ ప్రాజెక్టు పనులు వేగవంతం కావడంతో ఔటర్ రింగ్ రోడ్ దాటి ఉన్న ప్రాంతాలు కొత్త పెట్టుబడుల కేంద్రాలుగా మారుతున్నాయి. ముఖ్యంగా ఉత్తర, తూర్పు ప్రాంతాల్లో భూములకు భారీ డిమాండ్ ఏర్పడనుంది.

## 'ఫ్యూచర్ సిటీ' ఫ్యాక్టర్ ఆశలు...

మహేశ్వరం, ఆమంగల్, కందుకూర్ వంటి ప్రాంతాల్లో ప్రభుత్వం ప్రతిపాదించిన 'ఫ్యూచర్ సిటీ' ప్రాజెక్టు ఇప్పుడు రియల్ ఎస్టేట్ రంగంలో చర్చనీయాంశంగా మారింది. ఐటీ, ఇండస్ట్రీ, నివాస ప్రాజెక్టుల సమ్మిళితంగా రూపొందుతున్న ఈ ప్రణాళిక దక్షిణ హైదరాబాద్‌ను కొత్త ఆర్థిక కేంద్రంగా మలచే అవకాశముంది. దీంతో ఇప్పటివరకు కొంత వెనుకబడిన ప్రాంతాలు కూడా వేగంగా అభివృద్ధి చెందే అవకాశాలు కనిపిస్తున్నాయి. తక్కువ ధరలకు లభిస్తున్న భూములు దీర్ఘకాలిక పెట్టుబడిదారులకు ఆకర్షణీయంగా మారాయి.

విశ్వనగరంగా వేగంగా రూపాంతరం చెందుతున్న హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ రంగం 2026 నాటికి కొత్త దశలోకి ప్రవేశించింది. గత రెండు సంవత్సరాలుగా అమ్మకాలు నిలిచిపోగా, ఇప్పుడు మార్కెట్‌లో కదలిక స్పష్టంగా కనిపిస్తోంది. పెట్టుబడిదారుల ఊహాగానాల కంటే, వాస్తవ కొనుగోలుదారుల అవసరాలే మార్కెట్‌ను నడిపిస్తున్నాయి. ఇదే సమయంలో 2026-27 బడ్జెట్‌లో మౌలిక సదుపాయాలకు ప్రభుత్వం భారీ కేటాయింపులు చేయడం, మెట్రో రెండో దశ విస్తరణకు గ్రీన్ సిగ్నల్ రావడం వంటి పరిణామాలు రియల్ ఎస్టేట్ రంగానికి కొత్త ఊపునిస్తున్నాయి.

- విశాల భారతి, హైదరాబాద్



# విస్తరిస్తున్న రియల్ భాగ్యనగరం

## నిలకడగా రియల్ ఎస్టేట్

### నార్త్, ఈస్ట్ సిటీలే కీలకం .. ఆశలు పెంచుతున్న ఫ్యూచర్ సిటీ

### భవిష్యత్తు అంచనాలు...

నిపుణుల అంచనాల ప్రకారం, రాబోయే 3-5 సంవత్సరాల్లో హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగం మరింత బలపడే అవకాశం ఉంది. మెట్రో రెండో దశ, రీజనల్ రింగ్ రోడ్, ఫ్యూచర్ సిటీ వంటి ప్రాజెక్టులు పూర్తయితే నగర పరిధి మరింత విస్తరించనుంది. ప్రత్యేకంగా నార్త్, సౌత్ జోన్లలో ధరలు గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం తక్కువ ధరలతో లభిస్తున్న ప్రాంతాలు భవిష్యత్తులో ప్రీమియం మార్కెట్లుగా మారే అవకాశముంది. పెట్టుబడిదారులు తక్షణ లాభాల కంటే 5-7 సంవత్సరాల దీర్ఘకాలిక వ్యూహంతో ముందుకు సాగడం ఉత్తమమని నిపుణులు సూచిస్తున్నారూ. మొత్తానికి, హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్ ఇప్పుడు పరిణతి చెందిన దశలోకి అడుగుపెట్టింది. స్థిరమైన ధరలు, మెరుగైన మౌలిక సదుపాయాలు, పెరుగుతున్న పెట్టుబడులు చేసి నగరాన్ని దేశంలో అత్యంత ఆకర్షణీయ రియల్ ఎస్టేట్ గమ్యస్థానంగా నిలబెడుతున్నాయి. భాగ్యనగరం విస్తరిస్తూనే ఉంది.



## ప్రాంతాల వారీగా ధరల ధోరణి...

హైదరాబాద్‌లో వివిధ జోన్లలో ధరలు భిన్నంగా ఉన్నాయి. వెస్ట్ జోన్‌లోని కోకాపేట, గచ్చిబౌలి, తెల్లాపూర్ ప్రాంతాలు ఇంకా ప్రీమియం మార్కెట్‌గా కొనసాగుతున్నాయి. సెంట్రల్ జోన్‌లో బంజారాహిల్స్, సోమాజిగూడ వంటి ప్రాంతాల్లో స్థిరమైన పెరుగుదల ఉంది. అయితే అత్యధిక పెరుగుదల నార్త్, ఈస్ట్, సౌత్ జోన్లలో కనిపిస్తోంది. కొంపల్లి, మేడ్చల్ ప్రాంతాల్లో 18% పైగా, ఉప్పల్, ఎల్బీనగర్ ప్రాంతాల్లో 26% వరకు ధరలు పెరగడం గమనించదగ్గ విషయం. శంషాబాద్, మహేశ్వరం ప్రాంతాలు కూడా 20% పైగా వృద్ధిని నమోదు చేశాయి. ఈ ధోరణి ఒక కీలక సంకేతాన్ని ఇస్తోంది. నగర కేంద్రం నుంచి పరిసర ప్రాంతాలకు రియల్ ఎస్టేట్ విస్తరణ జరుగుతోంది.



## కమర్షియల్, వేర్‌హౌసింగ్ రంగాల్లో వేగం...

హైదరాబాద్ రియల్ ఎస్టేట్ అంటే కేవలం నివాస గృహాలకే పరిమితం కాదు. కమర్షియల్ ఆఫీస్ స్పేస్, వేర్‌హౌసింగ్ రంగాల్లో కూడా నగరం వేగంగా ఎదుగుతోంది. కొలియర్స్ నివేదిక ప్రకారం, దేశంలో 'ప్రైమ్ వేర్‌హౌసింగ్ హబ్'గా హైదరాబాద్ స్థానం సంపాదించింది. 2030 నాటికి నగరంలో వేర్‌హౌసింగ్ అవసరం 50 మిలియన్ చదరపు అడుగులను దాటే అవకాశం ఉందని అంచనా. ఫార్మా సిటీ, సెమీకండక్టర్ మిషన్ వంటి ప్రాజెక్టులు ఈ రంగానికి మరింత ఊతమిస్తున్నాయి. ఇది పెట్టుబడిదారులకు కొత్త అవకాశాలను సృష్టిస్తోంది. ముఖ్యంగా ఇండస్ట్రియల్ కారిడార్ల పరిసర ప్రాంతాల్లో భూముల విలువలు వేగంగా పెరుగుతున్నాయి.



## కొనుగోలుదారుల మార్కెట్...

గతంలో కనిపించిన ధరల అస్థిరత ప్రస్తుతం తగ్గింది. ఇది నిజమైన కొనుగోలుదారులకు అనుకూల పరిస్థితిని సృష్టించింది. గృహ రుణాలపై వడ్డీ రేట్లు సుమారు 5.5% వరకు తగ్గడం మధ్యతరగతి కుటుంబాలకు పెద్ద ఊరటగా మారింది. డెవలపర్లు కూడా వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా ప్రాజెక్టులను రూపొందిస్తున్నారు. ఎక్కువ స్థలం, మెరుగైన సౌకర్యాలు, గ్రీన్ స్పేస్ వంటి అంశాలకు ప్రాధాన్యం పెరిగింది.




# పెళ్లి తర్వాత కూడా తగ్గని జోరు

నేషనల్ క్రష్ రష్మిక మంధాన ప్రస్తుతం తన కెరీర్‌లో అగ్రస్థానంలో కొనసాగుతోంది. వ్యక్తిగత జీవితంపై ఎన్ని ఊహాగానాలు వచ్చినా, సినిమాల విషయంలో మాత్రం ఆమె ఎక్కడా తగ్గే ప్రసక్తే లేదని తన వరుస ప్రాజెక్టులతో క్లారిటీ ఇస్తుంది. సాధారణంగా హీరోయిన్లు పెళ్లి తర్వాత కెరీర్ వేగం తగ్గించుకుంటారు. కానీ రష్మిక మాత్రం అందుకు పూర్తి భిన్నంగా ముందుకు దూసుకెళ్తోంది. ప్రస్తుతం రష్మిక చేతిలో ఉన్న ప్రాజెక్టులు చూస్తే, రాబోయే రెండేళ్లు బాక్సాఫీస్ వద్ద ఆమె ఆధిపత్యం కొనసాగడం ఖాయంగా కనిపిస్తోంది. ముఖ్యంగా పాన్ ఇండియా స్థాయిలో ఆమె క్రేజ్ గణనీయంగా పెరిగింది. ఇప్పటికే పుష్ప 3లో శ్రీవల్లి పాత్రతో మళ్లీ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. సుకుమార్ దర్శకత్వంలో, అల్లు అర్జున్ హీరోగా తెరకెక్కుతున్న ఈ సినిమా మీద భారీ అంచనాలు నెలకొన్నాయి.నేషనల్ క్రష్ రష్మిక మంధాన ప్రస్తుతం తన కెరీర్‌లో అగ్రస్థానంలో కొనసాగుతోంది. వ్యక్తిగత జీవితంపై ఎన్ని ఊహాగానాలు వచ్చినా, సినిమాల విషయంలో మాత్రం ఆమె ఎక్కడా తగ్గే ప్రసక్తే లేదని తన వరుస ప్రాజెక్టులతో క్లారిటీ ఇస్తుంది. సాధారణంగా హీరోయిన్లు పెళ్లి తర్వాత కెరీర్ వేగం తగ్గించుకుంటారు. కానీ రష్మిక మాత్రం అందుకు పూర్తి భిన్నంగా ముందుకు దూసుకెళ్తోంది. ప్రస్తుతం రష్మిక చేతిలో ఉన్న ప్రాజెక్టులు చూస్తే, రాబోయే రెండేళ్లు బాక్సాఫీస్ వద్ద ఆమె ఆధిపత్యం కొనసాగడం ఖాయంగా కనిపిస్తోంది. ముఖ్యంగా పాన్ ఇండియా స్థాయిలో ఆమె క్రేజ్ గణనీయంగా పెరిగింది. ఇప్పటికే పుష్ప 3లో శ్రీవల్లి పాత్రతో మళ్లీ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. సుకుమార్ దర్శకత్వంలో, అల్లు అర్జున్ హీరోగా తెరకెక్కుతున్న ఈ సినిమా మీద భారీ అంచనాలు నెలకొన్నాయి.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.